
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
శనివారం 11 అక్టోబరు 2025



అధికారం కోల్పోయినా వైసీపీ నాయకుల దుందుడుకు వైఖరి మాత్రం మారలేదు. ఇప్పటికీ తాము అధికారంలోనే ఉన్నట్టుగానే భావిస్తున్న వారు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. మీడియా సమావేశాల్లో అధికారపక్షంపై తనదైనశైలిలో విమర్శలు గుప్పించే మాజీమంత్రి పేర్ని నాని శుక్రవారం మచిలీపట్నం పోలీస్‌స్టేషన్‌కు మందీమార్బలంతో వెళ్లి సీఐతో వాగ్వాదానికి దిగారు. తానేంటో చూపిస్తానని బెదిరింపు ధోరణితో మాట్లాడటం పోలీస్, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

మారని తీరు

ఇంకా అధికార దర్పాన్ని ప్రదర్శిస్తున్న వైసీపీ

మచిలీపట్నంలో మాజీమంత్రి పేర్ని నాని దుందుడుకు వైఖరి

- మచిలీపట్నం పీఎస్‌లో సీఐ ఏసుబాబుతో వాగ్వాదం
- ఓ కేసులో పోలీసుల వద్ద వైసీపీ నగర అధ్యక్షుడి డ్రామాలు
- పోలీసులకు సహకరించొద్దని సోషల్ మీడియాలో సందేశాలు
- ఆ నాయకుడిని కాపాడేందుకు పేర్ని నాని విశ్వప్రయత్నం
- కార్యకర్తలు, నాయకులతో వెళ్లి సీఐతో మాటలయుద్ధం



సీఐతో వాదులాడుతున్న మాజీమంత్రి, వైసీపీ నేత పేర్ని నాని

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించొద్దని వైసీపీ నాయకులు సెప్టెంబరు 19న మచిలీపట్నంలో ఆందోళన చేశారు. అనుమతులు లేకున్నా ఆందోళన చేయడంతో అదేరోజు పోలీసులు 400 మంది వైసీపీ కార్యకర్తలపై 61 (2), 132, 126 (2), 189(2) ఆర్‌డబ్ల్యూ, 190 బీఎన్ఎస్ ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ కేసులో పేర్లున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలకు పోలీసులు 41 నోటీసులు జారీ చేసేందుకు ఒక్కొక్కరినీ పోలీస్‌స్టేషన్‌కు పిలుస్తున్నారు.

తప్పించుకు తిరుగుతున్న వైసీపీ నగర అధ్యక్షుడు

మచిలీపట్నం నగర వైసీపీ అధ్యక్షుడిగా ఉన్న మేకల సుధాకర్‌బాబు (సుబ్బన్న)కు పోలీసులు నోటీసు ఇచ్చారు. విచారణకు హాజరుకాకుండా సుబ్బన్న పోలీస్ అధికారులు లేని సమయం చూసుకుని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, తరువాత వస్తానని చెప్పి తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతోపాటు ఈ కేసులో పేర్లున్న వారు పోలీసులకు సహకరించవద్దని, వైసీపీకి చెందిన వాట్సాప్ గ్రూపులో మెసేజ్‌లు పెడుతున్నాడు. ఈ సమాచారంతో పోలీసులు శుక్రవారం సుబ్బన్నను మచిలీపట్నం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామని పోలీసులు ప్రకటించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీమంత్రి పేర్ని నాని తన అనుచరులతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి మచిలీపట్నం ఇన్‌చార్జి సీఐ ఏసుబాబుతో వాగ్వాదానికి దిగారు. తానెవరో గుర్తు పట్టలేదని అన్నారని, తనను గుర్తుపెట్టుకునే రోజులు వస్తాయని, అప్పుడు తానేంటో చూపిస్తానని సీఐతో వాదులాడారు. దీంతో పేర్ని నానికీ, సీఐకు మధ్య వాగ్వాదం మిగతా 6లో..

గతంలోనూ ఇంతే..

సార్వత్రిక ఎన్నికల ముందు మచిలీపట్నం మండలం పోతేపల్లిలో టీడీపీ కార్యకర్తపై వైసీపీ కార్యకర్తలు రెండు విడతలుగా దాడి చేశారు. ఒకసారి టీడీపీ కార్యకర్త ఇంటికి వెళ్లి తమ కారులో ఎక్కించుకుని తీసుకెళ్లి మరీ దాడి చేశారు. అంతటితో ఆగకుండా బాధితుడిని పోలీస్‌స్టేషన్ వద్ద అప్పగించారు. రెండో విడత అదే కార్యకర్తపై దాడి చేయడంతో విసుగుచెందిన మచిలీపట్నం తాలూకా పోలీసులు వైసీపీ కార్యకర్తలను తమదైనశైలిలో మందలించారు. దీంతో ఎమ్మెల్యేగా ఉన్న పేర్ని నాని, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న పేర్ని కిట్టు, మేకల సుబ్బన్న తదితరులు తాలూకా పోలీస్‌స్టేషన్ వద్ద హంగామా సృష్టించారు. సీసీ కెమెరాలను, పోలీసుల వాహనాన్ని ధ్వంసం చేసే ప్రయత్నం చేశారు. ఈ ఘటనపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు.

చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం : ఎస్పీ విద్యాసాగర్

విధినిర్వహణలో ఉన్న పోలీసులను బెదిరిస్తే ఉపేక్షించేది లేదని, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. మచిలీపట్నంలోని ఎస్పీ కార్యాలయం సమావేశ హాల్లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మచిలీపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో మెడికల్ కళాశాల వద్ద ఆందోళనకు సంబంధించి పోలీసులు నమోదు చేసిన కేసులో నిందితులకు 41సీ నోటీసులు ఇచ్చామన్నారు. విచారణకు మేకల సుబ్బన్న హాజరు కాకపోవటం, సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో మిగతా వారిని కూడా విచారణకు సహకరించవద్దని సంక్షిప్త సమాచారం చేరవేయడాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారన్నారు. చట్టాన్ని ఉల్లంఘించడాన్ని తీవ్రంగా పరిగణించిన మచిలీపట్నం పోలీసులు సుబ్బన్నను రిమాండ్‌కు తరలించడానికి పోలీస్‌స్టేషన్‌కు పిలిపించామన్నారు. ఈ నేపథ్యంలో సుబ్బన్నకు మద్దతుగా మాజీమంత్రి పేర్ని నాని మిగతా 6లో..

నిమ్మకూరు గ్రామంలోని బంధువుల ఇంట్లో బాలకృష్ణ



నిమ్మకూరులో బాలయ్య సందడి


పామర్రు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తన స్వగ్రామమైన నిమ్మకూరులో శుక్రవారం సందడి చేశారు. జనసేన పార్టీ కాకినాడ ఎమ్మెల్యే పంతం నానాజీ కుమారుడి వివాహ నిమిత్తం విజయవాడకు చేరుకున్న ఆయన ఎలాంటి ఆడంబరాలు లేకుండా స్వగ్రామానికి విచ్చేశారు. సమీప బంధువుల ఇంట్లో కొద్దిసేపు గడిపారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధిపై పెద్దలతో చర్చించారు. ఏపీఆర్‌జేసీ విద్యార్థుల వసతి గృహాల ఆధునికీకరణకు అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. గ్రామంలో చేపడుతున్న ఇతర అభివృద్ధి కార్యక్రమాలను టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర వివరించారు. శుక్రవారం ఉదయం 11.08 గంటలకు నిమ్మకూరు చేరుకున్న బాలయ్య బంధువులతో కాలక్షేపం అనంతరం భోజనాలు ముగించుకుని ఒంటిగంటకు తిరిగి వెళ్లిపోయారు. గ్రామ సర్పంచ్ పడమటి శ్రీనివాసరావు, నందమూరి శివరామకృష్ణ, జయకృష్ణప్రసాద్, సూరపనేని అంకినీడు, కుదరవల్లి రఘురామయ్య, మంతెన రామాంజనేయులు తదితరులు బాలయ్యను కలిశారు.



బుడమేరు మింగేస్తోంది!

- పొలానికి వెళ్లాలంటే హడలిపోతున్న రైతులు 6
- నీటి ప్రవాహానికి ఇప్పటికి ఎనిమిదిమంది బలి
- బుడమేరు దాటే క్రమంలో అనేక ప్రమాదాలు
- వంతెన కోసం దశాబ్దాలుగా ఎదురుచూపులు

మల్లవల్లి మెగా ఫుడ్‌పార్కులోని సీపీసీ



మెగా ఫుడ్‌పార్కులోని సీపీసీకి జీవం

లులు అనుబంధ ఫెయిర్ ఎక్స్‌పోర్ట్స్‌కు కేటాయింపులు

- 66 ఏళ్లకు లీజు.. కేబినెట్‌లో కీలక నిర్ణయం
- ఏడాదికి రూ.50 లక్షలు.. ఐదేళ్లకు 5 శాతం పెంపు
- వైసీపీ హయాంలో మూలనపడిన సీపీసీ
- ఆహారశుద్ధి పరిశ్రమల అవసరాలను తీర్చే సెంటర్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మల్లవల్లి మెగా ఫుడ్‌పార్కులోని కోర్ ప్రాసెసింగ్ సెంటర్ (సీపీసీ)ను లులు గ్రూపునకు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. లులు గ్రూపులో అంతర్భాగమైన 'ఫెయిర్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్'కు రాష్ట్ర ప్రభుత్వం 66 సంవత్సరాలకు లీజుకిచ్చింది. ఏడాదికి రూ.50 లక్షల అద్దె ప్రాతిపదికన కేటాయింపులు జరిగాయి. ప్రతి ఐదేళ్లకు ఐదుశాతం పెంచేలా నిర్ణయం తీసుకున్నారు.

ఇన్నాళ్లకు పునరుద్ధరణ

మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ కారిడార్‌కు అనుబంధంగా గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో 100 ఎకరాల విస్తీర్ణంలో మెగా ఫుడ్‌పార్కును ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ఆహారశుద్ధి పరిశ్రమలను ప్రోత్సహించటానికి వీలుగా నాటి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మెగా మిగతా 6లో..

నకిలీ మకిలీ

కల్తీ మద్యం తయారీలో ఆ ముగ్గురే ప్రధానం

- ఇంజనీరింగ్ చదువులో కలిసిన స్నేహబంధం
- ఆ తర్వాత వ్యాపారులుగా.. ఇప్పుడు నిందితులుగా..
- నకిలీ మద్యం తయారుచేసి రూ.కోట్లు గడించాలని ఆశ
- ఒకరు పరారీ.. మరొకరు రిమాండ్‌లో..
- ఎట్టకేలకు పోలీసులకు చిక్కిన జనార్దనరావు
- రహస్య ప్రదేశంలో విచారణ చేస్తున్న పోలీసులు



గన్నవరం విమానాశ్రయంలో జనార్దనరావును అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

క్లాసులో ఒకే బెంచ్.. ఒకే వైఖరి ఆ ముగ్గురినీ స్నేహితులుగా మార్చింది. కళాశాల చదువు పూర్తయినా.. కలిసి వ్యాపారులుగా ఎదిగారు. మద్యం వ్యాపారంలోనూ కలిసే అడుగులు వేశారు. ఇంకా ఏదో సాధించేయాలన్న తపన వారిని నకిలీ మద్యం తయారుచేసే స్థాయికి తీసుకెళ్లింది. సిండికేట్లుగా ఏర్పడి అటు అన్నమయ్య జిల్లాలో, ఇటు ఎన్టీఆర్ జిల్లాలో హవా సాగించారు. చివరికి నకిలీ గుట్టురట్టు కావడంతో ఒక స్నేహితుడు శ్రీనివాసరావు రిమాండ్‌లో, ఇంకో స్నేహితుడు జయచంద్రారెడ్డి పరారీలో ఉండగా, ప్రధాన సూత్రధారి జనార్దనరావు శుక్రవారం పోలీసులకు చిక్కాడు.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : అద్దేపల్లి జనార్దనరావు.. ఇప్పుడు ఈ పేరుకు పెద్దగా పరిచయం అవసరం లేదు. ఆ పేరు చెప్పగానే ఠక్కున నకిలీ మద్యం తయారీ గుర్తొస్తుంది. వైద్యం నిమిత్తం విదేశాల్లో ఉన్నానని చెప్పుకొచ్చిన జనార్దనరావు శుక్రవారం ఎక్సైజ్ పోలీసులకు చిక్కాడు. గన్నవరం విమానాశ్రయంలో దిగిన అతడిని ఎక్సైజ్ సూపరింటెండెంట్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు.

నకిలీ ఐడియా జనార్దనరావుదే..

అద్దేపల్లి జనార్దనరావు రెండు కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. ములకలచెరువులో వెలుగులోకి వచ్చిన నకిలీ మద్యం తయారీ ప్లాంట్‌కు సంబంధించిన కేసులో ప్రధాన నిందితుడు. ఇటీవల టీడీపీ నుంచి సస్పెండ్ అయిన జయచంద్రారెడ్డి పరారీలో ఉన్నాడు. ఈ ఇద్దరితో పాటు మరో వ్యక్తి కొడాలి శ్రీనివాసరావు రిమాండ్‌లో ఉన్నాడు. నకిలీ మద్యం తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న ఆలోచన ముందుగా జనార్దనరావుకే వచ్చిందని తెలుస్తోంది. ములకలచెరువులో బీజం వేశాక క్రమంగా ఇబ్రహీంపట్నానికి విస్తరించినట్టు సమాచారం. ఓ రహస్య ప్రదేశంలో ఎక్సైజ్ అధికారులు జనార్దనరావును విచారణ చేస్తున్నారు. అతనేం చెబుతాడోనని సర్వత్రా ఉత్కంఠ రేగుతోంది.

నెల్లూరులో కలిసిన స్నేహబంధం

జనార్దనరావు ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందినవాడు. జయచంద్రారెడ్డి, కొడాలి శ్రీనివాసరావుది అన్నమయ్య జిల్లా. ఈ ముగ్గురూ నెల్లూరు జిల్లాలో ఇంజనీరింగ్ చదివారు. ఒకే కళాశాల, ఒకే బెంచ్ కావడంతో స్నేహితులయ్యారు. ఇంజనీరింగ్‌లో ఉన్నప్పుడు ఏర్పడిన బంధం పెరుగుతూనే వచ్చింది. కలిసి వ్యాపారాలు, మద్యం వ్యాపారాలు చేయడం మొదలుపెట్టారు. రాజకీయంగా మాత్రం వేర్వేరు మార్గాలను ఎంచుకున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా చేస్తున్న అక్రమ వ్యాపారాలు సజావుగా సాగించడమే దీనికి ప్రధాన కారణం. జయచంద్రారెడ్డి.. వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అనుచరుడిగా ఎదిగాడు. జనార్దనరావు ఇబ్రహీంపట్నంలో టీడీపీ నాయకుడిగా చెలామణి అవుతున్నాడు. అతడి సంబంధాలు మాత్రం వైసీపీ నేతలతో కొనసాగేవి.

సిండికేట్లుగా ఏర్పడి..

ములకలచెరువులో నాలుగు నెలల నుంచి, ఇబ్రహీంపట్నంలో మూడు నెలల నుంచి నకిలీ మద్యం తయారు చేస్తున్నట్టు ఎక్సైజ్ అధికారులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. దీనికి ముందు నుంచీ నకిలీ మద్యం తయారీ సాగుతున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. జనార్దనరావు పదేళ్లగా మిగతా 6లో..



14న ముహూర్తం

విజయవాడ మెట్రో టెండర్లు తెరిచేందుకు రంగంసిద్ధం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ మెట్రోరైల్ ప్రాజెక్టు టెండర్లను ఈ నెల 14న తెరిచేందుకు ఏపీఎంఆర్‌సీ అధికారులు రంగం సిద్ధం చేశారు. భాగస్వామ్య సంస్థలకు కూడా అవకాశం కల్పించిన నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లో ఆరోజు టెండర్లను పిలిచేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కాంట్రాక్టు సంస్థల నుంచి మంచి స్పందనే వచ్చింది. ప్రీ బిడ్డింగ్ మీటింగ్‌లో దాదాపు 10 సంస్థలకు పైగా పాలుపంచుకున్నాయి. ఒకేసారి భారీగా రూ.4,500 కోట్ల వ్యయంతో టెండర్లు పిలవటంతో నిర్మాణ పనులకు సంబంధించి బడా కాంట్రాక్టు సంస్థలే ముందుకొచ్చాయి. ఇప్పటి వరకు దేశంలోని మెట్రో ప్రాజెక్టుల నిర్మాణం తలపెట్టిన సందర్భాల్లో ముక్కలు ముక్కలుగా మాత్రమే పనులకు టెండర్లు పిలిచారు. విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు మాత్రం ఏలూరు, బందరు రోడ్డు కారిడార్లు రెండింటికీ కలిపి సింగిల్ టెండర్‌ను పిలిచారు. ఈనెల 14 సాయంత్రం వరకు కాంట్రాక్టు సంస్థలు బిడ్లను సమర్పించే అవకాశాలున్నాయి. ఇప్పటి వరకు ఏ సంస్థ బిడ్లను సమర్పించలేదు. ప్రీ బిడ్డింగ్ మీటింగ్ స్పందనను బట్టి.. జాయింట్ వెంచర్ (జేవీ) విధానంలో రెండు, మూడు సంస్థలు పోటీపడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. టెక్నికల్ బిడ్లను ముందుగా తెరుస్తారు. అర్హత సాధించిన దానిని బట్టి ఫైనాన్షియల్ బిడ్లను కూడా తెరుస్తారు. ఎంపిక చేసిన సంస్థ టోపో సర్వే, జియోగ్రాఫికల్ సర్వే, సాయిల్ టెస్ట్ నిర్వహించాల్సి ఉంటుంది. ఇందుకోసం నాలుగైదు నెలలు పట్టే అవకాశం ఉంది. ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా అధికారికంగా అనుమతులు వస్తే క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించటానికి అవకాశం కలుగుతుంది. ఇప్పటికే ఏపీఎంఆర్‌సీ అధికారులు ఏలూరు రోడ్డు కారిడార్‌కు సంబంధించి నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు రింగ్‌రోడ్డు వరకు డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌ను ప్రతిపాదిస్తూ డీపీఆర్ తయారు చేయించి కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖకు అందజేశారు. దీనికి కూడా అనుమతులు వస్తే విజయవాడ మెట్రో పనులకు ఎలాంటి అడ్డంకులు లేనట్టే.



దుర్గగుడిలో చీరల వేలంపాట

- ఏడాదికి రూ.8,15,00,000 + 5శాతం జీఎస్టీ
- కాంట్రాక్టు దక్కించుకున్న గుంటూరు మహిళ 6

పొరపాట్లకు తావులేకుండా ధాన్యం సేకరణ

- గోనె సంచులు, రవాణా వాహనాలు, హమాలీల కొరత ఉండకూడదు
- రైతుకు పూర్తి మద్దతు ధర అందించటమే లక్ష్యంగా పనిచేయాలి
- ధాన్యం సేకరణ అవగాహన, శిక్షణ సదస్సులో కలెక్టర్ బాలాజీ 6

క్రీడారంగంలో యువతకు ప్రోత్సాహం

- గన్నవరంలో పది క్రికెట్ నెట్‌లు
- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



కాస్త తగ్గారు..!

గంగూరు-గుణదల విద్యుత్ లైన్ల ఏర్పాటులో అధికారుల సవరణ

- పాత ఎస్ఎస్ఆర్ రద్దుచేసి కొత్త విధానానికి శ్రీకారం
- పాత విధానంలో కిలోమీటరుకు రూ.2.52 లక్షల ఖర్చు
- కొత్త విధానంతో కిలోమీటరుకు రూ.64 వేలే ఖర్చు
- ఆంధ్రజ్యోతి కథనంతో విద్యుత్ అధికారుల దిద్దుబాటు

గంగూరు-గుణదల ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ విద్యుత్ లైన్ల ఏర్పాటుపై విద్యుత్ శాఖ అధికారులు దిగొచ్చారు. విద్యుత్ లైన్ల ఏర్పాటుకు అయ్యే నిర్వహణ ఖర్చును నాలుగు రెట్లు ఎక్కువగా నిర్దేశించడం, ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో దిద్దుబాటు చర్యలకు పూనుకున్నారు. ఖర్చును సవరించి కొత్త ఎస్ఎస్ఆర్‌ను రూపొందించారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కృష్ణాజిల్లాలోని గంగూరు నుంచి ఎన్టీఆర్ జిల్లాలోని గుణదల వరకు 132 కేవీ హైటెన్షన్ కండక్టర్స్ ఏర్పాటుకు విద్యుత్ శాఖ అధికారులు టెండర్లు పిలిచారు. అంతకుముందు ఏర్పాటుచేసిన పాత హైటెన్షన్ కండక్టర్ లైన్స్ (హెచ్‌టీఎల్ఎస్) మార్చి అధునాతన హెచ్‌టీఎల్ఎస్‌లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ ప్రాజెక్టులో భాగంగా మొత్తం 60 కిలోమీటర్ల దూరంలో 20 కిలోమీటర్ల వరకు కొత్తలైన్ల ఏర్పాటుకు టెండర్లు పిలిచారు. లైన్ లాగేందుకు అయ్యే ఖర్చును కిలోమీటరుకు రూ.2.50 లక్షలుగా నిర్దేశించారు. దీనిపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి'లో 'ట్రాన్స్‌కో.. మిగతా 6లో..

ఎంత దుబారో చేశారో?

ఈ లెక్కన చూస్తే.. ఏటా విద్యుత్ శాఖ చేపట్టిన పనుల్లో భారీగానే నిధులు దుర్వినియోగమయ్యాయన్న అనుమానాలు వస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఏటా 400 కిలోమీటర్ల మేర ఈ పనులు జరుగుతుంటాయి. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 50 కిలోమీటర్ల పరిధిలో అయినా పనులు జరుగుతాయి. ఈ లెక్కన చూస్తే రూ.2 కోట్ల మేర ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అయ్యే అవకాశం ఉంది.

మిగిలిన కాంపోనెంట్స్‌తో మరింతగా..

కిలోమీటరుకు హైటెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటు విషయంలో బేసిక్ రేటు కాకుండా అలవెన్సులు, పన్నులు కూడా తగ్గిస్తే కిలోమీటరుకు రూ.4 లక్షల చొప్పున ఆదా అవుతుంది. ఈ లెక్కన గంగూరు-గుణదల ప్రాజెక్టుకే రూ.80 లక్షల మేర కలిసొస్తుంది.



దుర్గగుడి ప్రాంగణంలో చీరల వేలం కౌంటర్

దుర్గగుడిలో చీరల వేలం పాట

- ఏడాదికి రూ.8,15,00,000 + 5శాతం జీఎస్టీ
- కాంట్రాక్టు దక్కించుకున్న గుంటూరు మహిళ

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అమ్మవారికి భక్తులు సమర్పించే పట్టుచీరలు, సాధారణ చీరలు, కాటన్ చీరలు, జాకెట్టు ముక్కలు, ఎర్ర రంగు చీరలు, రవిక ముక్కలు, వివిధ రకాల వస్త్రాలను విక్రయించకొను లైసెన్స్ హక్కుకు శుక్రవారం మహామండపం 6వ అతస్తులో సీల్డ్ టెండర్, బహిరంగ వేలం నిర్వహించారు. ప్రథమ ధరావత్తు రూ.50,00,000లు చొప్పున డీడీ చెల్లించి బహిరంగ వేలంపాటలో ముగ్గురు పాల్గొన్నారు. గుంటూరుకు చెందిన మెస్సర్స్ శ్రీపావని కలెక్షన్స్ యజమాని నల్లూరి పావని మొదటి సంవత్సరానికి రూ.8,15,00,000లతో పాటు అదనంగా 5శాతం జీఎస్టీ చెల్లించేందుకు, రెండో సంవత్సరానికి మొదటి సంవత్సరపు లైసెన్స్ సొమ్ముపై 10శాతం అదనంగా చెల్లించేలా హెచ్చు పాట పాడుకున్నారు. ఇ-టెండర్ సీల్డ్ టెండర్‌లో ఎవరూ పాల్గొనలేదు. ఈనెల 1న టెండర్ కం వేలంపాటకు ప్రకటన ఇచ్చారు. గత ఏడాది రూ.6,04,24,445లు కంటే ప్రస్తుతం సుమారు 35శాతం అధికంగా శుక్రవారం బహిరంగ వేలంపాటలో వచ్చిన హెచ్చు రేటు రూ.8,15,00,000లకు ఖరారు చేస్తూ దేవదాయ కమిషనర్‌కు నివేదిక పంపినట్టు ఈవో శీనానాయక్ తెలిపారు.

2016 నుంచి ఇప్పటి వరకు వచ్చిన ఆదాయాలు

2016 నుంచి ఇప్పటి వరకు దుర్గగుడిలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు వేలం వేయగా ఆయా సంవత్సరాలలో వచ్చిన ఆదాయాల వివరాలు ఇలా ఉన్నాయి. 2016-17లో అప్పటి ఈవో ఐఏఎస్ అధికారిణి సూర్యకుమారి ఆధ్వర్యంలో రూ.1.74కోట్లు, మరుసటి సంవత్సరం రూ.2.80 కోట్లు వచ్చింది. 2018-19లో ఐఆర్ఎస్ అధికారిణి కోటేశ్వరమ్మ ఈవోగా ఉన్న సమయంలో రూ.8.10 కోట్లు వచ్చింది. 2019-20లో సురేష్ బాబు ఈవోగా నిర్వహించిన చీరల వేలంలో రూ.5.11 కోట్లు వచ్చింది. తర్వాత సంవత్సరం కొవిడ్ సమయంలో రూ.3.30కోట్లు వచ్చింది. ఆ తరువాత దర్భముళ్ల భ్రమరాంబ ఈవోగా వేలంలో వరుసగా రూ.3.10 కోట్లు, రూ.5కోట్లు వచ్చింది. 2023-24లో రామారావు ఈవోగా వేలంలో రూ.5కోట్లు వచ్చింది. ఈ ఏడాది ఈవో శీనానాయక్ ఆధ్వర్యంలో వేలంలో రూ.8.15కోట్లు ఆదాయం వచ్చింది.



శిక్షణ ముగించుకున్న ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందిస్తున్న మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

విలువలతో కూడిన విద్యనందించాలి

- మంత్రి కొల్లు రవీంద్ర

పామర్రు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలని శిక్షణను పూర్తిచేసుకున్న నూతన ఉపాధ్యాయులకు మంత్రి కొల్లురవీంద్ర పిలుపునిచ్చారు. స్థానిక ప్రగతి విద్యాసంస్థలో నూతన ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజాతో కలిసి శుక్రవారం మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ ద్వారా 16వేలమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదే అన్నారు. ఈ అవకాశాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకుని భవిష్యత్తు తరానికి విలువలతో కూడిన విద్యను అందించాలని కోరారు. అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న ఉపాధ్యాయులకు ధృవీకరణపత్రాలతోపాటు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీఈవో పీవీఎస్ రామారావు, ప్రగతి విద్యాసంస్థల అధినేత సనకా పూర్ణచంద్రారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడారంగంలో యువతకు ప్రోత్సాహం

- నియోజకవర్గంలో పది క్రికెట్ నెట్‌లు
- రాష్ట్రంలో తొలిసారిగా గన్నవరంలో ఏర్పాటు
- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



క్రికెట్ నెట్‌ను ప్రారంభించి ఆడుతున్న యార్లగడ్డ

గన్నవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : క్రీడారంగంలో యువతను ప్రోత్సహించడంలో భాగంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో 10 క్రికెట్ నెట్‌లు ఏర్పాటు చేయనున్నట్టు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. రాష్ట్రంలోనే తొలి సారి గన్నవరం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రూ.13.5 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన క్రికెట్ బాక్సును శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే ప్రారంభించారు. కొద్దిసేపు క్రికెట్ ఆడిన యువతను ఉత్సాహపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో క్రికెట్ నెట్‌ల ఏర్పాటు ద్వారా ప్రభుత్వ స్థలాలను కాపాడటంతో పాటు గ్రామపంచాయతీకి ఆదాయం సమకూరుతుందన్నారు. నియోజకవర్గంలో యువతను క్రీడారంగంలో ప్రోత్సహించేందుకు రాబోయే మూడు నెలల్లో 10 గ్రామాల్లో క్రికెట్ నెట్‌లు ఏర్పాటు చేస్తామని, కొన్నిచోట్ల వాలీబాల్, షటిల్, కబడ్డీ కోర్టుల ఏర్పాటుకు యోచిస్తున్నట్టు చెప్పారు. ఈ ప్రయోగం విజయవంతమైతే రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో అమలుపరిచే అవకాశం ఉందన్నారు. నామమాత్రపు ఫీజుతో క్రికెట్ బాక్సుల్లో ఆడుకునేందుకు వీలుంటుందని క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, గ్రామ సర్పంచ్ నిడమర్తి సౌజన్య, టీడీపీ మండల అధ్యక్షుడు గూడపాటి తులసీమోహన్, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ యువతకు ఖతర్‌లో ఉద్యోగావకాశాలు

- కార్పొరేషన్ జిల్లా ఈడీ ఎస్కే ఫర్జానా బేగం

కృష్ణలంక : రాష్ట్రంలోని ముస్లిం, క్రైస్తవ, ఇతర మైనార్టీ వర్గాల యువతకు నర్సింగ్, హెల్త్‌కేర్, టెక్నికల్, సేవా రంగాల్లో మంచి అవకాశాలు వున్నాయని, ప్రభుత్వ అధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల ద్వారా అవసరమైన శిక్షణ అందించి, ఖతార్‌లో ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నట్టు మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ జిల్లా ఈడీ ఫర్జానా బేగం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్స్ ఉద్యోగానికి మైనార్టీ (పురుషులు, మహిళలు) అభ్యర్థులు రిజిష్టర్ చేసుకోవచ్చని, బీఎస్సీ/జీఎన్ఎం పూర్తిచేసి 21-40 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.1,20,000 వేతనం వుంటుందని, ఉచిత నివాసం, రవాణా, వైద్యం, వీసా, విమాన చార్జీలు వుంటాయన్నారు. ఈనెల 13న నమోదు, ఇంటర్వ్యూలు వుంటాయని, అభ్యర్థులు వివరాలను జిల్లా కార్యాలయంలో సమర్పించాలన్నారు. వివరాలకు 9849901148, 9985306408, 0866-2491148 నెంబర్లలో సంప్రదించాలని ఈడీ ఫర్జానా బేగం తెలిపారు.

బుడమేరు మింగేస్తోంది!



బుడమేరు - పులివాగు కలిసే ప్రాంతంలో ఉధృతంగా వరద

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం)

పొలానికి పోయినోళ్ల ప్రాణాలతో ఇంటికి తిరిగొచ్చే వరకు ఇంటిల్లిపాది కళ్లల్లో ఒత్తులు పెటుకుని చూడాల్సిందే! సాయంత్రానికి వస్తే వచ్చినట్లు లేకుంటే బుడమేరు మింగినట్టే! ఇలా ఒకరుకాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా ఎనిమిది మందిని బుడమేరు ప్రవాహం తనలో కలిపేసుకుంది. 2010లో మొదలైన బుడమేటిలో గల్లంతు మరణాలు ఇంకా కొనసాగుతున్నాయి. ఏ క్షణం ఎవరింట విషాద వార్త వినాల్సి వస్తుందోనని గ్రామస్థులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని బతికేస్తున్నారు. విజయవాడకు కూతవేటు దూరంలో ఉన్న వెలగలేరు మాజీమంత్రి స్వర్గీయ చనమోలు వెంకట్రావ్ స్వగ్రామం. గ్రామ రైతులు, రైతు కూలీలు గ్రామంలో తమ పొలాలకు వెళ్లాలంటే బుడమేరు దాటాల్సిందే. ఈ క్రమంలో ఇప్పటికే ఎనిమిది మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఇది చాలదన్నట్టు పోలవరం రాకతో

- పొలానికి వెళ్లాలంటే హడలిపోతున్న రైతులు
- నీటి ప్రవాహానికి ఎనిమిదిమంది బలి
- బుడమేరు దాటే క్రమంలో అనేక ప్రమాదాలు
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం
- వంతెన కోసం దశాబ్దాలుగా ఎదురు చూపులు

గ్రామానికి మరింత కష్టమొచ్చింది. గ్రామస్థులకు పొంచి ఉన్న నీటి గండం గురించి సమగ్ర కథనం...

ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలంలోని వెలగలేరు గ్రామానికి చెందిన రైతులకు పినపాక శివారు నర్సాయిగూడెం ఏరియాలో సుమారు వెయ్యి ఎకరాలు పంట భూములున్నాయి. వీరు పొలాలకు వెళ్లి వ్యవసాయం చేసుకోవాలంటే బుడమేరు దాటాల్సి ఉంటుంది. బుడమేరు దాటే క్రమంలో వరద ప్రవాహానికి ఇప్పటివరకు ముగ్గురు వ్యవసాయ కూలీలు, ముగ్గురు రైతులు, ఇద్దరు యువకులు ప్రాణాలను పోగొట్టుకున్నారు. గ్రామస్థులు బుడమేరును దాటే ప్రదేశంలోనే జి.కొండూరు వైపు నుంచి ఉధృతంగా పులివాగు వచ్చి కలుస్తుంది. వాగు దాటేవారు వరద ప్రవాహంలో గల్లంతవుతున్నారు. ప్రతి ఖరీఫ్ సీజన్‌లో రైతులు, రైతు కూలీలు బుడమేరులో దిగి అవతలి ఒడ్డున ఉన్న పొలాలకు వెళుతుంటారు. పనులు ముగించుకొని తిరిగి ఇవతల ఒడ్డుకు చేరుకొని ఇళ్లకు వెళుతుంటారు. ఈక్రమంలో ఎగువన వర్షాలు పడటం బుడమేరు, పులివాగు ఉప్పొంగడంతో వరద ఉధృతి పెరిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

మృత్యు కుహరం

2010 ఖరీఫ్ సీజన్‌లో రైతు గద్దె శంకర్రావు(రైతు) బుడమేరు దాటుతూ మృత్యువాత పడ్డాడు. అదే ఏడాది నెల తిరక్క ముందే పొలం పనులు ముగించుకొని ఇంటికి వస్తూ వ్యవసాయ కూలీలు కొవ్వల వెంకాయమ్మ,వల్లూరు బుజ్జి, తొమ్మండ్రు రూతులు బుడమేరు దాటుతు వరలో చిక్కుకొని మృత్యువాత పడ్డారు. 2018లో మంచినీళ్ల కృష్ణ మూర్తి, 2020లో నవదీప్ (17), 2022లో ఈశ్వరరావు, కొనరాజు ఫణికుమార్‌లు మృతి చెందారు.

వంతెన నిర్మాణం చేపట్టాలి

బుడమేటిలో ప్రాణాలు కలిసిపోతున్నా.. అధికారులు ఇక్కడ వంతెన అవసరాన్ని గుర్తించకపోవడం గమనార్హం. రైతు కూలీల ప్రాణాలు పోతున్నా పాలకులకు పట్టడం లేదు.

ఇటీవల పలువురు రైతులు వంతెన నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే విషయాన్ని ఇరిగేషన్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రైతులు, రైతు కూలీలు కష్టాల నుంచి గట్టెక్కాలంటే వంతెన నిర్మించాల్సిందే.

ఇతర గ్రామాల మీదుగా పొలాలకు వెళుతున్నాం..



- దూబా నాగేశ్వరరావు (రైతు)

పొలాల్లోకి వెళ్లాలంటే బుడమేరు దాటాల్సిందే.. పొలాల్లో ముమ్మరంగా పనులు చేసుకోవాల్సిన సమయంలో వెళ్లలేకపోతున్నాం. అత్యవసర పరిస్థితుల్లో కవులూరు, పినపాక గ్రామాల మీదుగా వెళ్లాల్సి వస్తున్నది. దూరం పెరగడంతో పాటు రవాణా ఖర్చుల భారం పడుతోంది. కూలీలను తరలించాలంటే అదనపు భారం తప్పడం లేదు. వంతెన నిర్మాణం అవశ్యం.

బుడమేరు కష్టాలకు పోలవరం తోడైంది..



- మారుపెద్ద శంకర్రావు (రైతు)

పట్టిసీమ నుంచి గోదావరి నీరు పోలవరం కాలువలో కలుస్తుంది. దీంతో 45 రోజులు పొలాలకు వెళ్లే అవకాశం లేదు. వర్షాకాలం వస్తే నిత్యం బుడమేరు, పులివాగులు పొంగి ప్రవహిస్తుండటంతో ఖరీఫ్ సీజన్ మొత్తం పొలాలకు వెళ్లలేక పోతున్నాం. బుడమేరులో ఇప్పటికే ఎనిమిది మంది చనిపోయారు. అధికారులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలి.

వంతెన నిర్మించి గట్టెక్కించండి



- డి.వంశీకృష్ణ (రైతు)

ఇక్కడ వంతెన నిర్మించి రైతులు, రైతు కూలీల ప్రాణాలు కాపాడాలి. ఆ దిశగా అధికారులు తక్షణం స్పందించాలి. కూలీలు, రైతులు ప్రాణాలు కోల్పోయినా ప్రభుత్వాలు స్పందించకపోడం శోచనీయం. తక్షణం వంతెన నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయించాలి.

'స్టాల్ ఇన్ మాల్'తో చేయూత

- జనవరి 9 వరకు గ్రామీణ హస్త కళాకారుల ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలు
- నాబార్డ్ డీజీఎం బెహ్రా



స్టాల్ ఇన్ మాల్‌లో వస్త్రాలను పరిశీలిస్తున్న నాబార్డ్ డీజీఎం

కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామీణ హస్తకళాకారులు తయారుచేసిన ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించి ఉపాధి అవకాశాలు మెరుగు పరచాలనే లక్ష్యంతో ప్రైవేట్ షాపింగ్ మాల్స్‌లోనూ 'స్టాల్ ఇన్ మాల్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నాబార్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎంఎం బెహ్రా అన్నారు. నాబార్డ్ ఆర్థిక సహాయంతో నేస్తం స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో స్థానిక పీవీపీ మాల్‌లో ఏర్పాటు చేసిన 'స్టాల్ ఇన్ మాల్' ప్రదర్శనను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామీణ హస్తకళాకారులు తయారుచేసిన ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించి, వారి జీవన ప్రమాణాలు పెంచడంతో పాటు కళాత్మక సంపదను భావితరాలకు అందజేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. నేస్తం స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో గతంలో నిర్వహించిన చేనేత వస్త్రాలు, జ్యూట్ బ్యాగులు, కలంకారి వస్త్రాలు, కొండపల్లి బొమ్మలు, ముత్యాల దండలు వంటి ప్రదర్శన, అమ్మకాలు వినియోగదారులను ఎంతగానో ఆకట్టుకోవడంతో మంచి సత్‌ఫలితాలనిచ్చాయన్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన 'స్టాల్ ఇన్ మాల్' ప్రదర్శన జనవరి 9 వరకు వుంటుందని, ఏపీతో పాటు ఒడిశా, చత్తీస్‌ఘడ్, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి కూడా కళాకారులు తమ ఉత్పత్తులను అందుబాటులో వుంచుతారన్నారు. నేస్తం సంస్థ సీఈవో వి.సురేష్ మాట్లాడుతూ, నాబార్డ్ సహకారంతో విశాఖపట్నం, విజయవాడ పట్టణాలలో స్టాల్ ఇన్ మాల్స్ ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని, ఒక్కో ప్రదర్శన 90 రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. హస్తకళాకారులు, చేతివృత్తిదారులకు 15 రోజుల పాటు ప్రదర్శన, అమ్మకాలు నిర్వహించుకొనేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాబార్డ్ అసిస్టెంట్ మేనేజర్ కల్లేష్, నేస్తం స్వచ్ఛంద సంస్థ సిబ్బంది, గ్రామీణ హస్తకళాకారులు పాల్గొన్నారు.

సుప్రీం జస్టిస్ గవాయ్‌పై దాడి యత్నం

ప్రజాస్వామిక, లౌకికతత్వాలపై దాడి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న పి.ప్రసాద్

గాంధీనగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడియత్నం రాజ్యాంగంలోని ప్రజాస్వామిక, లౌకికతత్వాలపై దాడిగా పలువురు వక్తలు ఉద్ఘాటించారు. ఈ సంఘటనపై సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా అఖిల భారత న్యాయవాదుల సంఘం జాతీయ నేత సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, జస్టిస్ గవాయ్‌పై దాడి వెనుక హిందూత్వ ఫాసిజం దాగుందని ఆరోపించారు. న్యాయస్థానాలు తమకు అనుకూలంగా తీర్పులు ఇవ్వాలని మనువాదుల హెచ్చరికగా ఈ దాడిని గుర్తించాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ, మనువాద భావజాల దారిద్ర్యం నుంచి బయట పడవేసేందుకు బలమైన సాంస్కృతిక ఉద్యమాన్ని నిర్మించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సీపీఎం రాష్ట్ర నేత అంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ, జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడి కేవలం రాజ్యాంగంపై మాత్రమేకాదని కుల వివక్షతకు నిదర్శనమన్నారు. హక్కుల సంఘం (సీఎల్‌సీ) రాష్ట్ర అధ్యక్షుడు చిలకా చంద్రశేఖర్ మాట్లాడుతూ, దేశంలోని రాజ్యాంగ వ్యవస్థలను ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులు లోబరచుకుంటున్నారని ఆరోపించారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ప్రజలపై మనువాద, కార్పొరేట్ దాడులు జరుగుతున్నాయన్నారు. జస్టిస్ గవాయ్ కార్పొరేట్ ఆర్థిక దాడికి వ్యతిరేకంగా మాట్లాడటం ఆర్ఎస్ఎస్ హిందుత్వవాదులకు కంటగింపుగా మారిందన్నారు. ఎంసీపీఐ నేతలు ఎం.వెంకటరెడ్డి, ఖాదర్‌బాషా, ఓపీడీఆర్, విరసం నేతలు సి.భాస్కరరావు, అరసవల్లి కృష్ణ, పీవోడబ్ల్యూ నాయకురాలు గంగాభవానీ, హక్కుల సంఘం నేత పిచ్చుక శ్రీనివాసరావు, పీడీఎస్‌యూ నేత రాజేష్, పలు ప్రజా, కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

పొరపాట్లకు తావులేకుండా ధాన్యం సేకరణ

- గోనె సంచులు, రవాణా వాహనాలు, హమాలీల కొరత ఉండకూడదు
- రైతుకు పూర్తిమద్దతు ధర అందించటమే లక్ష్యంగా పనిచేయాలి
- ధాన్యం సేకరణ అవగాహన, శిక్షణ సదస్సులో కలెక్టర్ బాలాజీ



ధాన్యం సేకరణపై అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జిల్లాలో ధాన్యం సేకరణ పకడ్బందీగా చేపట్టాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో బందరు డివిజన్ పరిధిలోని తహసీల్దార్‌లు, వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులు(విఏఏ), సాంకేతిక సహాయకులకు(టిఏ) ఖరీఫ్ సీజన్ 2025-26 సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన ధాన్యం సేకరణపై అవగాహన శిక్షణ సదస్సు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి పాల్గొన్నారు. జిల్లాలో ధాన్యం సేకరణ సజావుగా సాగేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్ అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుకు పూర్తి మద్ధతు ధర అందించటంలో అధికారులు, సిబ్బంది క్రియాశీలకంగా పనిచేయాలన్నారు. గత సంవత్సర ధాన్యం సేకరణలోని లోటుపాట్లను గుర్తించి పునరావృతం కాకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా గోనె సంచులు, రవాణా వాహనాలు, హమాలీల కొరత రాకుండా ముందస్తు ప్రణాళిక కలిగి ఉండాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి పంటకు పూర్తిమద్ధతు ధర పొందేవిధంగా ఆయా అంశాల పట్ల రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.స్వాతి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి.శివరాంప్రసాద్, వ్యవసాయశాఖ అధికారిణి ఎస్.పద్మావతి, సహకార శాఖ జిల్లా అధికారి కె.చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్‌లు, వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఇలక్కియా

ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయండి

- జేసీ ఇలక్కియా

కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా అధికారులను ఆదేశించారు. జిల్లాలోని రైస్ మిల్లర్లతో శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారులు, రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, రైస్ మిల్లర్లను బ్యాంక్ గ్యారెంటీలు అక్టోబరు 15వ తేదీలోగా సమర్పించాలని, మూమెంట్ ఆర్డర్ ప్రకారం ఖాళీ గన్నీ బస్తాలను కొనుగోలు కేంద్రాలకు పంపిణీ చేయాలని ఆదేశించారు. అలాగే ధాన్యం ట్రక్కులను చేరిన 24 గంటల్లో ఎఫ్ఐఎఫ్‌వో పద్ధతిలో అన్‌లోడ్ చేసి, ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌లో వెంటనే ట్రక్ షీట్లు అకనాలెడ్జ్ చేయాలని సూచించారు. జిల్లాలో 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు.

మెగా ఫుడ్‌పార్కులో సీపీసీకి జీవం

(5వ పేజీ తరువాయి)

ఫుడ్‌పార్కులో పరిశ్రమలకు 'కామన్ సర్వీసెస్' కింద రూ.24 కోట్లతో కోర్ ప్రాసెసింగ్ సెంటర్ (సీపీసీ)ను ఏర్పాటు చేశారు. ఈ సీపీసీని 7.48 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. ఆహారశుద్ధి పరిశ్రమలకు అవసరమైన పల్పింగ్, ప్యాకింగ్, రిఫైనింగ్, కోల్డ్ స్టోరేజ్, వేర్‌హౌసింగ్ వంటి సదుపాయాలు కల్పించారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వ హయాంలో దీని నిర్వహణ అధ్వానంగా మారింది. ఒక ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించటం వల్ల నిర్వహణ సక్రమంగా జరగలేదు. దీంతో సీపీసీ కార్యకలాపాలు నిలిచిపోయాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో సీపీసీని ఎలాగైనా పునరుద్ధరించాలని ఏపీఐఐసీ భావిస్తోంది. సరిగ్గా ఇదే తరుణంలో లులు గ్రూపు మల్లవల్లి మెగా ఫుడ్‌పార్కులోని సీపీసీపై దృష్టిసారించి ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపింది. ప్రభుత్వ స్థాయిలో లులు అనుబంధ సంస్థకు కేటాయించాలని ఇంతకుముందే నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశంలో దీనిపై సానుకూలంగా స్పందించారు.

కాస్త తగ్గారు..!

(5వ పేజీ తరువాయి)

పెంచుకో' శీర్షికన కథనం ప్రచురితమైంది. తెలంగాణాలో లైన్ ఏర్పాటు ఖర్చు కిలోమీటరుకు రూ.50 వేలు ఉంటే, ఉమ్మడి కృష్ణాజిల్లాలోని విద్యుత్ అధికారులు మాత్రం రూ.2.52 లక్షలు నిర్దేశించారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో టెండర్‌ను రద్దు చేశారు. తాజాగా విద్యుత్ శాఖ అధికారులు కొత్త ఎస్ఎస్ఆర్‌ను విడుదల చేశారు. ఈ ఎస్ఎస్ఆర్‌లో బేసిక్ రేటును కిలోమీటరుకు రూ.64 వేలుగా నిర్ణయించారు. అదే పాత ఎస్ఎస్ఆర్‌లో కిలోమీటరుకు మూడు పాంథర్ కండక్టర్ల ఏర్పాటుకు రూ.2,52,089ను నిర్ణయించారు. అంటే.. రూ.1,88,089 తగ్గించారు. నాడు ఎందుకు ఇంత ఖర్చు పెంచాల్సి వచ్చిందో విద్యుత్ శాఖ అధికారులకే తెలియాలి. తీరా తప్పు బయటకు వచ్చే సరికి దిద్దుబాటు చర్యలు చేపట్టారు.

నకిలీ మకిలీ

(5వ పేజీ తరువాయి)

మద్యం వ్యాపారంలో ఉన్నాడు. ఇబ్రహీంపట్నంలోనే ఏఎన్నార్ బార్‌ను నిర్వహిస్తున్నాడు. బార్‌తో పాటు మరికొన్ని మద్యం దుకాణాలను తమ చేతుల్లో ఉంచుకోవడానికి ఈ ముగ్గురూ కలిసి సిండికేట్లను ఏర్పాటు చేసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో సిండికేట్ బాధ్యతలను జనార్దనరావు, అన్నమయ్య జిల్లాలో సిండికేట్ బాధ్యతలను జయచంద్రారెడ్డి, కొడాలి శ్రీనివాసరావు తీసుకున్నారు. ఒక్కో సిండికేట్‌లో 10-20 మందిని ఏర్పాటు చేసుకున్నాడు. బార్‌లు, మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ ఇచ్చినప్పుడు, ఆహ్వానించినప్పుడు సిండికేట్‌లో ఉన్న సభ్యులంతా తలోదిక్కున దరఖాస్తు చేసుకునేవారు. బార్ కానీ, మద్యం దుకాణం కానీ ఎవరికి దక్కినా అందరికీ వాటాలు ఉండేలా సిండికేట్ మధ్య ఒప్పందం చేసుకున్నారు. ఇలా సిండికేట్‌లో ఉన్న షాపులకు, బార్‌లకు నకిలీ మద్యం వెళ్లినట్టు తెలుస్తోంది. ఇందులో ఇప్పటి వరకు విద్యాధరపురంలో ఉన్న శ్రీనివాస వైన్స్ పేరు మాత్రమే వెలుగులోకి వచ్చింది.

మారని తీరు

(5వ పేజీ తరువాయి)

జరిగింది. సీఐ మాట్లాడుతూ.. 'ఏం చేస్తారండీ బాబూ.. మమ్మల్ని ఉరివేస్తారా, వేస్తే వేయండి..' అనడంతో 'వైసీపీ కార్యకర్తలను మీరు ఉరివేస్తారా, వేయండి..' అంటూ పేర్ని ఆవేశంతో ఊగిపోయారు. సీఐని బెదిరిస్తూ పేర్ని నాని మాట్లాడిన సంఘటనకు సంబంధించిన వీడియోలు బయటకు రావడంతో ఇది చర్చనీయాంశంగా మారింది. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు వైసీపీ నాయకులు శాంతియుతంగా ర్యాలీ చేస్తే పోలీసులతో అడ్డుకున్నారని, మంత్రి కొల్లు రవీంద్ర సూచనతోనే పోలీసులు వైసీపీ కార్యకర్తలను అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ ఘటనలో ఒకేసారి 400 మంది వైసీపీ కార్యకర్తలు, నాయకులపై కేసు పెట్టడం ఏమిటని, ఈ అంశంపై న్యాయపోరాటం చేస్తామని పేర్ని మీడియాతో అన్నారు. కాగా సుబ్బన్నను శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆయనకు బెయిల్ మంజూరు చేశారు. సొంత పూచీకత్తుపై సుబ్బన్న విడుదలయ్యారు.

చట్టప్రకారం చర్యలు : ఎస్పీ

(5వ పేజీ తరువాయి)

పోలీస్‌స్టేషన్‌కు వచ్చి స్టేషన్ సీఐ ఏసుబాబుపై దురుసుగా ప్రవర్తించడం, బెదిరించడానికి ప్రయత్నించడాన్ని ఎస్పీ ఖండించారు. పోలీసులను, పోలీసు వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ఎస్పీగా తనపై ఉందన్నారు. విధినిర్వహణలో ఉన్న పోలీసులను అగౌరవపరిచినా, అవమానించినా, బెదిరింపులకు పాల్పడినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా స్టేషన్‌కు వచ్చి మాట్లాడవచ్చని, జనాలతో వచ్చి ఎస్పై, సీఐలను బెదిరించడం మంచిది కాదన్నారు. ఈ సమావేశంలో బందరు డీఎస్పీ సీహెచ్ రాజా తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	248
చికెన్ స్కిన్‌లెస్	258

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

గన్నవరం సెంటర్‌లో గాంధీజీ కాంస్య విగ్రహ స్థాపనకు చర్యలు తీసుకోండి

● ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు ఆర్యవైశ్య సంఘం నాయకుల వినతి

గన్నవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంటర్‌లో మహాత్మాగాంధీ నూతన కాంస్య విగ్రహం స్థాపించేందుకు అవరోధాలను పరిష్కరించి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆర్యవైశ్య సంఘం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు విజ్ఞప్తి చేసింది. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు కుర్మాల సత్య శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును శుక్రవారం రాత్రి కలసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. ఆర్య వైశ్య సంఘ సభ్యులు శ్రీకాకుళపు సత్యనారాయణ, మడుపల్లి బాలకృష్ణమూర్తి, తాటికొండ ప్రసాద్, కందగడ్ల జితేంద్ర, అప్పాల ప్రసాద్, మానేపల్లి దశరధరామయ్య, బోసు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా సామగ్రి స్వాధీనం



కంకిపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలూరులో అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా సామగ్రిని కంకిపాడు పోలీసులు గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఉప్పలూరులో వంగర వెంకటేశ్వరరావు ఇంట్లో సుమారు రూ. 2.68 లక్షల విలువైన దీపావళి మందుగుండు సామాగ్రి నిలువ ఉన్నట్లు పక్కా సామాచారం రావడంతో సీఐ జె. మురళీకృష్ణ, ఎస్సై తాతాచార్యులు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎటువంటి అనుమతులు లేకుండా నిలువ ఉంచిన దీపావళి మందుగుండు సామాగ్రిని గుర్తించి వాటిని సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ హత్య కేసులో నిందితులకు జీవితఖైదు

కంకిపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మహిళను హత్య చేసి బంగారం, నగదు అపహరించిన నిందితులకు విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు జీవితఖైదు విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంకిపాడుకు చెందిన కర్రి శ్రీదేవిని ఫిబ్రవరి 28, 2017లో ఆమె నివాసంలోనే నల్లిమిల్లి సూర్రెడ్డి, కంచర్ల జ్యోతి, బూసి జయకృష్ణ, బాషా హత్య చేశారు. ఇంట్లో ఉన్న బంగారం, రూ. 4 లక్షల నగదు అపహరించుకుపోయారు. అప్పుడు కంకిపాడు ఎస్సై హనీష్‌బాబు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందుతలను అదుపులోకి తీసుకోని కోర్టుకు హాజరు పరిచారు. విజయవాడ ఐదవ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు జడ్జి విచారణ అనంతరం ముద్దాయిలపై నేరం రుజు అయింది. దీంతో ఏ4గా ఉన్న బాషా మరణించడంతో మిగిలిన ఎ1 నల్లిమిల్లి సూర్రెడ్డి, ఎ2 కంచర్ల జ్యోతి, ఎ3 బూసి జయకృష్ణలకు జీవిత ఖైదు విధించారు.

కామన్ ఎగ్జామినేషన్ బోర్డు జిల్లా కార్యదర్శిగా విజయ్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : కామన్ ఎగ్జామి నేషన్ బోర్డు (డీసీఈబీ) జిల్లా కార్యదర్శిగా వేలేరు హెచ్‌ఎం కొమ్మా విజయ్ నియమితులయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.కె.రామారావు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కమిటీ సమావేశంలో కొమ్మా విజయ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పలువురు ఉపాధ్యాయులు ఆయన్ని అభినందించారు.

ఘోరీ మసీదులో ప్రత్యేక ప్రార్థనలు

ఉయ్యూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్యార్మీ పర్వదినం పురస్కరించుకుని ఘోరీ మసీదులో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ మాజీ చైర్మన్ అబుకలాం, వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు సత్తార్, కో-ఆప్షన్ సభ్యుడు ఖలీల్, ఆధ్వర్యంలో జలీల్ పెద్దయెత్తున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసారు. ఒకరికొకరు గ్యార్మీ పర్వదిన శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



పోరంకిలో డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. శుక్రవారం పోరంకి -నిడమానూరు రోడ్డులో రూ. 33 లక్షలతో నిర్మించ తలపెట్టిన డ్రెయినేజీకి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పోరంకిలో అధిక వర్షపాతంతో రోడ్డంతా మురుగు నీటితో నిండిపోతోందని, స్థానికులు ఎన్నో ఏళ్లగా ఇబ్బందులు పడుతున్నారని, వీరి ఇబ్బందులు తొలిగించాలనే ఉద్దేశంతో ఇంతకుముందే ఒక వైపు డ్రెయిన్ నిర్మాణం పూర్తి చేశామని, ప్రస్తుతం మళ్లీ రెండో వైపు డ్రెయిన్ నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కూటమి నేతలు అనుమోలు ప్రభాకరరావు, వాసు, చెన్నుపాటి శ్రీనివాస్, యాళ్ల చక్రవర్తి, సంగెపు రంగారావు, తాతపూడి గణేష్, బొంగరాల అబ్రహం పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు పై అవగాహన

తాడిగడప మునిసిపాలిటీ పోరంకిలోని వీ అండ్ వీ ఇన్‌ఫ్రా రాయల్ రిడ్జ్‌లో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ఎలక్ట్రానిక్ ఉత్సవ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొన్నారు. సూపర్ జీఎస్టీ పథకం వల్ల ఎలక్ట్రానిక్ వస్తువుల ధరల్లో తగ్గుదల గురించి కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నేతలు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

ఉయ్యూరు : జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్స్ ఉత్సవ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఉయ్యూరు చైర్మన్ సత్యనారాయణ, జీఎస్టీ ఏసీ ఆర్, బాలాజీ బాబు, జేసీ జె.కల్పన, డీసీటీవో ఎం. స్వరూపరాణి, ఎంపీడీవో శేషగిరిరావు, తేజ డిజిటల్స్ అధినేతలు నేరెళ్ల వేణు, తేజ, నాగశివ, రాజేశ్వరీ, షణ్ముఖ ఎలక్ట్రానిక్స్ అధినేతలు శివప్రసాద్, రాజులపాటి కుమార్, కె.కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం వలన సామాన్య ప్రజలపై ధరల భారం తగ్గిందని గుడివాడ డీసీ టీవో ఎం. సునీత తెలిపారు. బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మారుతీ, మదీనా ఎలక్ట్రానిక్స్ షోరూంల్లో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రానిక్ ఉత్సవ్ నిర్వహించారు.

యనమదల ఈశ్వరి విజయలక్ష్మి మృతి



విజయలక్ష్మి

గన్నవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పుర ప్రముఖులు యనమదల వీరరాఘవ రావుకు సతీవియోగం కలిగింది. ఆయన భార్య యనమదల ఈశ్వరి విజయలక్ష్మి (82) వృద్ధాప్యంతో గురువారం రాత్రి మృతి చెందారు. ఆమెకు భర్తతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె బదరి విశాలాక్షి భర్త ముక్కామల సురేంద్రబాబు ప్రముఖ పారిశ్రామికవేత్త, విజయలక్ష్మి భౌతికకాయాన్ని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, చిక్కవరం సర్పంచ్ అన్నే లక్ష్మణరావు తదితర గ్రామ ప్రముఖులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఉయ్యూరులో విద్యార్థుల ప్రదర్శన

ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి

ఉయ్యూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత పాటించి, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం ద్వారా పర్యా వరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని అవగాహన కల్పిస్తూ శ్రీశ్రీనివాస అక్షరాలయ సీబీసీఎస్ఈ పాఠశాల విద్యార్థులు శుక్రవారం ఆట పాటలతో ప్రదర్శన నిర్వహించారు. ఉయ్యూరు చైర్మన్ వి.సత్యనారాయణ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. శ్రీశ్రీనివాస విద్యాసంస్థల అధినేతలు పరుచూరి శ్రీనివాసరావు, నీలిమ, పాఠశాల పరిపాలన అధికారి సురేశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఆక్యుపంక్చర్ చికిత్సపై శిక్షణ

కానూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కానూరు అశోక్ నగర్‌లోని ఇండియన్ ఓం కేంద్ర కార్యాలయంలో ఆక్యుపంక్చర్ చికిత్స విధానంపై ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు వారం రోజులపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇండియన్ ఓం కేంద్ర కార్యాలయం చైర్మన్, కోర్సు డైరెక్టర్ డాక్టర్ మకాల సత్యనారాయణ చెప్పారు. భారత ప్రభుత్వ ప్రోత్సాహంతో, భారత్ సేవక్ సమాజ్ (బీఎస్ఎస్) సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఏపీ ఖాదీ బోర్డుతో ఒప్పందం కూడా కుదుర్చుకున్నామని డాక్టర్ సత్యనారాయణ తెలిపారు.

ముస్తాబాద బుక్‌కీపర్‌ను కొనసాగించాలి

గన్నవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తొలగించిన బుక్‌కీపర్‌ను కొనసాగించాలని కోరుతూ స్థానిక వెలుగు కార్యాలయంలో పలువురు డ్వాక్రా మహిళలు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. మండలంలోని ముస్తాబాద వీవో-2 బుక్ కీపర్‌గా చేస్తున్న రాయనపాటి జ్యోతి పనిచేస్తున్నారు. జ్యోతిని బుక్ కీపర్‌గా కొనసాగించకపోతే ఆందోళన చేస్తామని నర్రా కనకదుర్గ, నాగూర్, పద్మావతి, మంగతయారు, వరలక్ష్మీ, పద్మజ, నాగ శిరోమణి, సోలా విజయలక్ష్మీ, నాగమణి తెలిపారు.

స.హ చట్టంతో జవాబుదారీ తనం

ఉయ్యూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంతో అధికారుల్లో జవాబుదారీతనం పెరుగుతుందని తహసీల్దార్ ఎం. సురేశ్‌కుమార్ అన్నారు. ఇండియన్ యాక్ట్స్ అవేర్నెస్ వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం 2005 వారోత్సవాలు పురస్కరించుకుని యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ సంయుక్త ఆధ్వర్యంలో సమాచారహక్కు చట్టం పోస్టర్‌ను తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. యుఫ్ ఆర్టీఐ సభ్యులు జంపాన శ్రీనివాసగౌడ్, అయ్యకి సురేశ్‌బాబు, బండి నాగసాంబిరెడ్డి, బేతపూడి జోగేశ్వరరావు, నాగరాజు, యశ్వంత్ కుమార్, సాంబశివరావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి గోగినేని కృషి మరువలేం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి గోగినేని శివరామకృష్ణ చేసిన కృషి మరువలేనిది అని టీడీపీ నాయకులు యార్లగడ్డ సతీష్, ఆళ్ల గోపాలకృష్ణ, దయాల రాజేశ్వరరావు కొనియాడారు. అంపాపురంలో శుక్రవారం గోగినేని శివరామకృష్ణ భౌతికకాయంపై పూలమాలలు వేసి, టీడీపీ జెండా కప్పి నివాళులర్పించారు. చిరుమామిళ్ల సూర్యం, మూల్పూరు వెంకటరత్నం, వేములపల్లి శ్రీనివాసరావు, గుండపనేని ఉమావరప్రసాద్, మూల్పూరి సాయి కళ్యాణి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ అవిర్నేని భవానీశంకర్, తదితరులు నివాళులర్పించారు.

● అందరినీ కలుపుకునే మంచి మనిషి గోగినేని శివరామకృష్ణ అని విజయ చైర్మన్ చలసాని ఆంజనేయులు కొనియాడారు. గోగినేని భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



రోడ్డుకు అడ్డుగా పెట్టిన తూములు

డ్రెయిన్ నిర్మాణ పనులతో మూసేసిన రోడ్డు

● పది రోజులగా ఇబ్బందిపడుతున్న ప్రజలు

కానూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : కానూరు మెయిన్ రోడ్డు కెనడీ హైస్కూల్ నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు డ్రెయినేజీ నిర్మాణం కోసం ఆ ప్రాంతంలో రోడ్డును మూసివేశారు. దీంతో కానూరు మెయిన్ రోడ్డు నుంచి ఊళ్లోకి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డుకు రెండు వైపుల మేజర్ డ్రెయినేజీ పనులు చేస్తున్నారు. పనులకు అంతరాయం కలగకుండా ముందు జాగ్రత్తగా రోడ్డుకు అడ్డంగా సిమెంట్ తూములు ఏర్పాటు చేసి రోడ్డును మూసివేశారు. దీంతో కానూరు ఊళ్లోకి వెళ్లే ఆర్టీసీ బస్సులను కెనడీ స్కూల్ నుంచి తిప్పుకొని వెనుకకు వెళ్లాలిసిన పరిస్థితి నెలకొంది. మెయిన్ రోడ్డులో కొంత భాగం మూసివేసి డ్రెయినేజీ పనులు చేస్తున్నట్లు ముందుగా మున్సిపల్ అధికారులు ప్రకటించలేదని స్థానికులు మండిపడుతున్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

ఉయ్యూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు.హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబీ సరోజిని పాల్గొన్నారు.

ఉంగుటూరు: బాలికల సమగ్రాభివృద్ధి, సాధికారతపై దృష్టి సారించాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.శ్రీహరిబాబు అన్నారు. తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పొట్టిపాడు ఎంపీపీ పాఠశాలలో బాలికా దినోత్సవం నిర్వహించారు.

గన్నవరం: దావాజిగూడెం జడ్పీ హైస్కూల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలి కా దినోత్సవం నిర్వహించారు. సూపర్‌వైజర్ సత్యవాణి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉంగుటూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : నందమూరు 33/11కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ కారణంగా పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్‌శాఖ గుడివాడ ఈఈ జీబీ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేమండ, నందమూరు, మానికొండ, చాగంటిపాడు, చికినాల, బొకినాల, మధిరపాడు వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

గన్నవరం : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాను శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గన్నవరం, మర్లపాలెం, చిన అవుటపల్లి, దుర్గాపురం, ఎయిర్‌పోర్టు సిటీ, గొల్లనపల్లి, బీబీగూడెం ప్రాంతాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు సరఫరాను నిలిపివేస్తున్నామని తెలిపారు.

ఉయ్యూరు : ఉయ్యూరు, గండిగుంట, కాటూరు, నందమూరు సబ్‌స్టేషన్లు, విద్యుత్‌లైన్ల మరమ్మతుల చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీసీపీడీసీఎల్ ఈఈ బి.సుధాకర్ తెలిపారు.

కానూరు : కానూరు సబ్‌స్టేషన్ 11 కేవీ నాగార్జున ఫీడర్, భాగ్యనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతు పనులు నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గుమ్మడితోట, వాటర్ ట్యాంక్ రోడ్డు, ఆర్‌బీకే, వికసిత్ నగర్, కెనడీ స్కూల్ వెనుక భాగం, సెయింట్ థెరీస్సా స్కూల్, చలసాని నగర్, ఉమా శంకర్‌నగర్, పంట కాలువ రోడ్డు, ఎండోమెంట్ కాలనీ, కామయ్య తోపు లో సరఫరా నిలిపివేయనున్నట్టు గుణదల విద్యుత్ శాఖ ఈఈ హరిబాబు తెలిపారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఆకర్షించిన అకడమిక్ ఎక్స్‌పో



జ్యోతి వెలిగించి అకడమిక్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న డాక్టర్ అమిర్త గణేష్

ప్రసాదంపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వైజ్ఞానిక ప్రదర్శనల వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ బయటకు వస్తుందని, విద్యార్థి అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయని ఎయిమ్స్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ అమిర్త గణేష్ అన్నారు. శుక్రవారం నిడమానూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విజయవాడలో అకడమిక్ ఎక్స్‌పోను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన పలు వైజ్ఞానిక నమూనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల అకడమిక్ డైరెక్టర్ డేవిడ్ రాజ్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో వ్యక్తిగత నైపుణ్యాన్ని పెంపొందించడానికి పాఠశాల యాజమాన్యం ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పి.పవన్‌చంద్, శ్వేత బిందు, కె.ప్రవీణ్ కుమార్, ప్రిన్సిపాల్ ఎం.ఎస్ భువనేశ్వరన్, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్ కుమార్ భాటియా పాల్గొన్నారు.

కానూరు శ్రీచైతన్యలో
ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం



ప్రసంగిస్తున్న ఆర్‌కే అయోధ్య

కానూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : కానూరులోని శ్రీచైతన్య స్కూల్ ఐపీఎల్ అండ్ ఎంపీఎల్ బ్రాంచ్‌లో శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు ఆర్‌కే అయోధ్య హాజరై మానసిక ఆరోగ్య ప్రాధాన్యత, ఒత్తిడిని అధిగమించడం ఎలా, జ్ఞాపకశక్తిని పెంపొందించుకునే మార్గాలను వివరించారు. శ్రీచైతన్య స్కూల్ ఈజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ పద్మ మాట్లాడుతూ, విద్యార్థులు వత్తిడి లేకుండా విద్యను అభ్యసించడం కోసం తాము వారికి గేమ్స్, యోగా, ఎక్స్‌ట్రా కరిక్యూలర్ అంశాలపై తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఎగ్జిక్యూటివ్ డీన్ నాగభూషణంతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌కే అయోధ్యను ఘనంగా సత్కరించారు.

సానుకూల ఆలోచనలతో ఒత్తిడి దూరం

విద్యార్థులు సానుకుల ఆలోచనలు, సమయపాలన పాటిస్తే ఒత్తిడి, ఆందోళన, నిరుత్సాహం నుంచి బయటపడవచ్చని అనీల్ న్యూరో అండ్ ట్రామా సెంటర్ వైద్యులు డాక్టర్ కె. శ్రీకాంత్, డాక్టర్ డి. అనీల్‌కుమార్ చెప్పారు. ప్రపంచ మానసిక దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఎం. రవిచంద్, ప్రో. వీసీ రత్న ప్రసాద్, డీన్ వెంకట్రావు, శివరాం ప్రసాద్, పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్య సమాజాన్ని నిర్మిద్దాం

- 'టెలీమానస్' ద్వారా మానసిక ఆరోగ్య సేవలు
- ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

విజయవాడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తీవ్ర ఒత్తిళ్ల కారణంగా ప్రజల్లో మానసిక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, మానసికంగా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం సమష్టిగా కృషి చేయాలని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో 'అత్యవసర పరిస్థితుల్లో మానసిక ఆరోగ్య సంరక్షణ' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. రోజువారీ జీవితంలో ఎదురయ్యే ఒత్తిళ్లతో ప్రజల్లో మానసిక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయన్నారు. పది ప్రధాన వ్యాధుల్లో మానసిక వ్యాధిని కూడా చేర్చామని చెప్పారు. దీనికి సంబంధించిన అడ్వయిజరీ బోర్డు చైర్మన్‌గా డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డిని నియమిస్తున్నట్టు తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నివేదిక ప్రకారం ప్రపంచంవ్యాప్తంగా 97 కోట్ల మంది మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారని, భారత్‌లో ఆ సంఖ్య 15 కోట్లుగా ఉందని వెల్లడించారు. మానసిక వైద్యులు, క్లినికల్ సైకాలజిస్టుల కొరత తీర్చడానికి ప్రభుత్వం ప్రయతిస్తోందన్నారు.

రాష్ట్రంలో 'టెలీమానస్' కార్యక్రమం ద్వారా మానసిక ఆరోగ్య సేవలు అందిస్తున్నట్టు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మానసిక సమస్యలతో బాధపడే వారు టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే మానసిక వైద్య నిపుణులు వారికి కౌన్సిలింగ్ ఇస్తారని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలోనూ మానసిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. విశాఖపట్నంలోని ప్రభుత్వ మానసిక వైద్యశాలను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అప్‌గ్రేడ్ చేశామన్నారు. ధర్మవరం, కాకినాడలో కొత్తగా ఆయుర్వేద కళాశాలలు మంజూరు అయ్యాన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి, ప్రముఖ ఈఎన్‌టీ సర్జన్ (యూకే) డాక్టర్ కృష్ణా రెడ్డి, డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ఐఎంఏ చైర్మన్ డాక్టర్ శ్రీహరి రావు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, చిత్రంలో కలెక్టర్ లక్ష్మీశ, మానసిన వ్యాధుల సలహా బోర్డు చైర్మన్ డాక్టర్ రామసుబ్బారెడ్డి తదితరులు

ఆయేషా తల్లిదండ్రులకు దర్యాప్తు నివేదిక అందజేయండి!

- అధికారులకు సీబీఐ కోర్టు ఆదేశం
- తదుపరి విచారణ 31కి వాయిదా

విజయవాడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బీఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసు దర్యాప్తు నివేదికను ఆమె తల్లిదండ్రులకు అందజేయాలని సీబీఐ అధికారులను విజయవాడ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం ఆదేశించింది. ఆయేషా మీరా హత్య కేసులో తిరిగి దర్యాప్తు చేపట్టిన సీబీఐ.. దర్యాప్తు ముగిసిన అనంతరం నివేదికను కోర్టుకు సమర్పించింది. ఈ నివేదికను తమకు అందజేయాలని కోరు తూ ఆయేషా తల్లిదండ్రులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇది విచారణ దశలో ఉంది. ఇదిలా ఉండగా, ఈ కేసులో నిందితుడిగా పేర్కొన్న పిడతల సత్యంబాబుపై నమోదైన అభియోగాలపై అభ్యంతరాలు చెప్పాలని, కోర్టుకు హాజరై వివరించాలని సీబీఐ కోర్టు వారికి నోటీసులు జారీచేసింది. నోటీసులు తీసుకోవడానికి నిరాకరించిన ఆయేషా తల్లిదండ్రులు.. దర్యాప్తు నివేదికను తమకు ఇవ్వాలని కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై ఆయేషా తల్లిదండ్రుల తరపున న్యా యవాది పిచ్చుక శ్రీనివాస్, సీబీఐ తరపున గోపీనాథ్ వాదనలు వినిపించారు. దీనిపై న్యాయాధికారి అన్నపూర్ణ శుక్రవారం తీర్పు ఇచ్చారు. దర్యాప్తు నివేదికను ఆయేషా తల్లిదండ్రులకు అందజేయాలని ఆదేశించారు. తదుపరి విచారణను ఈనెల 31వ తేదీకి వాయిదా వేశారు.

ఆగ్రోస్ చైర్మన్ సుబ్బానాయుడుకు తీవ్ర అస్వస్థత

- కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన మంత్రి లోకేశ్

అమరావతి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఆగ్రోస్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. రాష్ట్ర సచివాలయంలో సీఎం నిర్వహించిన సమీక్షలో సు బ్బానాయుడు పాల్గొన్నారు. అదే రోజు రాత్రి తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను హుటాహుటిన మణిపాల్‌కు తరలించారు. సీఎం చంద్రబాబు అయన ఆరోగ్య పరిస్థితిని వాకబు చేశారు. త్వరగా కోలుకోవాలని సీఎం ఆకాక్షించారు. మంత్రి లోకేశ్ ఆసుపత్రికి వెళ్లి, సుబ్బానాయుడి ఆరోగ్య పరిస్థితినిఅడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు

- మహిళల సమస్యల పరిష్కారానికి ఆన్‌లైన్ పోర్టల్
- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ



స్పాట్‌లైట్‌లో మాట్లాడుతున్న ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ, హాజరైన విద్యార్థినులు

వన్‌టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బాలికలు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడినా, సోషల్ మీడియాలో తప్పుగా పోస్ట్ చేసినా కఠిన చర్యలు తప్పవని ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని యూజీసీ ఉమెన్స్ స్టడీ సెంటర్, ఏపీ మహిళా కమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ కేబీఎన్ కళాశాలలో స్పాట్‌లైట్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. శైలజ మాట్లాడుతూ అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ప్రతి ఏడాది అక్టోబరు 11న జరుపుకుంటున్నామని, బాలికా దినోత్సవాలు అంటూ ఒక్క రోజు జరుపుకోవడం కాదు, ఏడాది మొత్తం అవగాహన సదస్సులు జరుపుకున్నప్పుడే అద్భుత ఫలితాలు సాధించగలమన్నారు. దీంతో సమాజంలో సైతం మార్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చిన్నారులు, బాలికలు, మహిళలు స్వేచ్ఛగా, సంతోషంగా జీవించే హక్కు కలిగి ఉన్నారని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. పని ప్రదేశంలో అఘాయిత్యాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యలు ఉంటే మహిళలు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మహిళా చట్టాలపై అవగాహన పెంచేలా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు, బాలికలు స్వయంగా తమ కార్యాలయానికి రాలేని పరిస్థితులు ఉండటం, వివరాల గోప్యత వంటి విషయాలను గుర్తించి ఆన్‌లైన్ పోర్టల్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. మహిళలపై అఘాయిత్యాయాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా దేశంలోనే మొదటి రాష్ట్రంగా ఏపీని నిలపాలన్న ఆలోచనను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. మరొకరు అలాంటి తప్పుడు పనులు చేయకుండా భయపడే విధంగా చట్టాలు ఉండాలని విద్యార్థుల నుంచి విజ్ఞప్తులు రావడం హర్షనీయమన్నారు. ముందుగా మారపు ట్రస్ట్ చైర్మన్ ఆర్. సుయజ్, రాయపాటి శైలజ ముఖాముఖి నిర్వహించారు. మహిళలపై ప్రస్తుతం జరుగుతున్న అఘాయిత్యాలు, సోషల్ మీడియా వేదికగా వేధింపులు తదితర అంశాలపై అడిగిన ప్రశ్నలకు రాయపాటి శైలజ విపులంగా సమాధానాలు చెప్పారు. విద్యార్థినిలు అడిగిన ప్రశ్నలకు కూడా సమాధానాలు చెప్పడంతో పాటు వారిలోని జిజ్ఞాసను ప్రశంసించారు. అనంతరం కేబీఎన్ కళాశాల ఉపాధ్యాయ, అధ్యాపక బృందం శైలజను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి మెమొంటో బహూకరించారు.



ఆంజనేయస్వామి గుడి వద్ద పోలవరం కాల్వ మట్టిని అక్రమంగా తవ్వేసిన ప్రాంతం

పోలవరం కాల్వ మట్టిని తవ్వేస్తున్నారు!

- తీరని వైసీపీ నేతల మట్టిదాహం
- అర్ధరాత్రిళ్లు యథేచ్ఛగా తరలింపు

విజయవాడ రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్ల పాలనలో అక్రమ మైనింగ్‌కు అలవాటు పడిన వైసీపీ నేతల మట్టి దాహం ఇంకా తీరలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వైసీపీ నేతల తీరు మార్చుకోవడం లేదు. ప్రతిపక్షంలో ఉండి కూడా యథేచ్ఛగా అక్రమ మైనింగ్‌కు పాల్పడుతూ అధికారులకు, పాలకులకు సవాల్ విసురుతు న్నారు. విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో గత మూడు రోజులుగా పోలవరం మట్టిని యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. గ్రామ శివారుల్లోని పోలవరం కాల్వ వెంబడి ఆంజనేయ స్వామి ఆలయం, రుద్రవరం ప్రాంతాలతో పాటుగా పలు చోట్ల ఇష్టానుసారం తవ్వకాలు జరుపుతున్నారు. గ్రామానికి చెందిన వైసీపీ నేతలు కొందరు అర్ధరాత్రిళ్లు పోలవరం మట్టిని అక్రమంగా తవ్వి అమ్మకాలు జరుపుతున్నట్లు సమాచారం. రాత్రి 11 గంటలు దాటిన తర్వాత ఎక్స్‌కవేటర్ల తవ్వకాలు జరిపి ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. ఒకే చోట తవ్వితే అనుమానం వస్తుందనే కారణంతో పోలవరం కాలువ వెంబడి పలు చోట్ల తవ్వకాలు జరుపుతున్నట్లు స్థానికులు తెలిపారు.

రెవెన్యూ, పోలీసుల రాకతో పరార్

గత మూడు రోజులుగా అర్ధరాత్రిళ్ల జరుగుతున్న తవ్వకాలపై కొందరు గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. గురువారం అర్ధరాత్రి సమయంలో ఆర్ఐ సాయికృష్ణ, ఎస్సై విమల సిబ్బందితో తవ్వకాలు జరుగుతున ప్రాంతానికి వెళ్లారు. అధికారులు వస్తున్న విషయం తెలుసుకున్న అక్రమార్కులు అక్కడి నుంచి పరారయ్యారు. గ్రామంలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గోపాలాచార్యులు విగ్రహాన్ని ఆవిష్కరించి, నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తదితరులు

ఆయుర్వేదానికి పునరుజ్జీవం

- దీవి గోపాలాచార్యులు విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే మండలి

నాగాయలంక, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : భారతదేశంలో ప్రాచీన ఆయుర్వేదాన్ని పునరుజ్జీవింప చేసిన మహనీయుడు దీవి గోపాలాచార్యులు అని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. భావదేవరపల్లిలోని భావన్నారాయణ స్వామి దేవస్థానం సమీపంలో ఆయుర్వే మార్తాండ దీవి గోపాలాచార్యులు విగ్రహాన్ని వంశీయులతో కలిసి శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. సర్పంచ్ మండలి ఉదయభాస్కర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ దీవి గోపాలాచార్యులు విగ్రహాన్ని గ్రామంలో ఏర్పాటు చేసుకోవటం ఆనందంగా ఉందన్నారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యాన్ని అణచివేసే ప్రయత్నం చేస్తే, బ్రిటీష్ రాణికి ఆయుర్వేద వైద్యం చేసి, వైద్య రత్న అవార్డు అందుకున్న మహోన్నతుడు గోపాలాచార్యులు అన్నారు. ప్లేగు, కలరా వంటి మహమ్మారి వ్యాధుల లక్షణాలను పరిశోధించి ఆయుర్వేదంలో మందులు కనిపెట్టిన గొప్ప వైద్యుడని కొనియాడారు. విజయవాడ ఆయుర్వేద కళాశాల పీజీ విద్యార్థులచే ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరాన్ని నిర్వహించారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.సాయిబాబు, ఎంపీడీవో వెంగళరావు, గోపాలాచార్యులు కుటుంబ సభ్యులు, దీవి వంశీయులు, ప్రముఖ ప్రభుత్వ ఆయుర్వే వైద్యులతో పాటు నియోజకవర్గంలోని కూటమి నేతలు పాల్గొని ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.


పది వేల స్వయం సహాయక సంఘాలకు లింకేజీ రుణాలు



ఖాతాదారులతో మాట్లాడుతున్న కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం

జగ్గయ్యపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి పది వేల స్వయం సహాయక సంఘాలకు లింకేజీ రుణాలు అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం అన్నారు. కేడీసీసీ బ్యాంకు జగ్గయ్యపేట బ్రాంచిలో సొసైటీల చైర్‌పర్సన్లు, అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. నెట్టెం మాట్లాడుతూ, కేడీసీసీ బ్యాంకులో డిజిటలైజేషన్ పూర్తి చేశామన్నారు. షెడ్యూల్ బ్యాంకులు తరహాలో అన్ని రకాల సేవలు, రుణాలు అందజేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల స్వయం సహాయక సంఘాలు స్థానిక సొసైటీల్లో బ్యాంకు ఖాతాలు ప్రారంభించి, లావాదేవీలు నిర్వహించేందుకు వీలుగా సెర్ప్, కేడీసీసీ బ్యాంకు, సొసైటీ మధ్య అనుసంధానానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అర్బన్ ప్రాంతాల్లో వ్యవసాయం తగ్గిపోవటంతో పంట రుణాల శాతం బాగా పడిపోతున్నదున, ప్రత్యామ్నాయంగా ప్రభు త్వం లక్ష్యాలకు అనుగుణంగా ఎంఎస్ఎంఈ రుణాలు చిరువ్యాపారులకు రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. పీఎం సూర్యఘర్ పథకానికి బ్యాంకు ద్వారా రుణాలు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. అనంతరం ఆ యన జగ్గయ్యపేట బ్రాంచి పరిధిలోని మల్కాపురం సొసైటీ కార్యాలయాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని నెట్టెం రఘురాం చెప్పారు. జగ్గయ్యపేటలోని కృష్ణా రైతు సేవా సంఘాన్ని, గోపాలకృష్ణ విశాల సహకార పరపతి సం ఘాలను సందర్శించారు. జనఔషధి దుకాణాన్ని, బ్యాంకింగ్ కౌంటర్లను పరిశీలించారు. బండిపాలెం, గౌరవరం సొసైటీల్లో లాకర్ సదుపాయాలు పెంచుతామన్నారు. సమీక్షా సమావేశంలో నందిగామ ఏజీఎం శ్రీదేవి, స్థానిక బ్రాంచ్ చీఫ్ మేనే జర్ రమేష్, సొసైటీల అధ్యక్షులు యానాల గోపీచంద్, కట్టా నరసింహారావు, అప్పారావు, జి.పిచ్చయ్య చౌదరి, ఎం.రామకృష్ణారెడ్డి, కార్యదర్శులు కనపర్తి నారాయణరావు, మీసాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కక్షలుండవు.. అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే కొలికపూడి



తిరువూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాలకు అతీతంగా అభివృద్ధే లక్ష్యమని, రాజకీయ కక్షల్ని సహించేది లేదని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. చైర్‌పర్సన్ కొలికపోగు నిర్మల అధ్యక్షతన శుక్రవారం జరిగిన ము న్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొలికపూడి పైవిధంగా స్పందించారు. సభ్యులు లేవనెత్తిన సమస్యలపై స్పందించారు. అర్బన్‌హెల్త్ భవనం పనులు పూర్తికి నిధుల కేటాయింపు అంశంపై వైసీపీ కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు(బీరువాల బాబు)తంగిరాల వెంకటరెడ్డి మాట్లాడుతూ, భవన నాణ్యతపై విచారణ నిర్వహించాలని, సంబందిత కాంట్రాక్టర్ నుంచి నష్టపరిహారం వసూలు చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రత్యేక గ్రాంటు రూ.2.50 కోట్ల నిధులతో పనులకు టెండర్లు పిలిచి, తదుపరి పనులు ఎందుకు రద్దు చేశారని ఎమ్మెల్యే కొలికపూడి అధికారుల్ని ప్రశ్నించారు. డంపింగ్ యార్డు మీదుగా పంపింగ్ స్కీం వరకు రహదారి నిర్మాణ అంశంపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అంతగా ఉపయోగం లేని ప్రాతంలో రోడ్డు నిర్మించేకంటే, ప్రజలకు అవసరం అయిన ప్రాంతంలో రహదారి నిర్మించాలని కొందరు సభ్యులు చేసిన సూచనతో, ఈ అంశాన్ని వాయిదా వేశా రు. మరోమారు అధికారులు పరిశీలించాలని సూచించారు. ఐదు, ఆరు వార్డుల కౌన్సిలర్ల సభ్యత్వం రద్దు అంశం ప్రస్తావించగా, ఎవ్వరి సభ్యత్వం రద్దు కాదని, రాజకీయ కక్ష సాధిం పులు ఉండవన్నారు. కౌన్సిల్‌లో 15 అంశాలక 13 అంశాలను కౌన్సిల్ అమోదించింది. వైస్‌చైర్‌పర్సన్లు వెలుగోటి విజయలక్ష్మి, గుమ్మ వెంకటేశ్వరమ్మ, కమిషనర్ కె.మనోజ, మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు. కౌన్సిల్ సమావేశంలో ప్రతిపక్ష వైసీపీ కౌన్సిలర్లు ఎక్కువ సంఖ్యలో హాజరైనా, అజెండాలోని రెండు అంశాలు మినహా మిగిలిన 13 అంశాలు ఎటువంటి అభ్యంతరాలు లేకుండా అమోదం పొందడ గమనార్హం.



మక్కపేట చౌరాస్తాలో బంధువులతో కలిసి రాస్తారోకో చేస్తున్న అరుణ

పెళ్లికి ప్రేమికుడు నిరాకరణ
బంధువులతో కలిసి యువతి రాస్తారోకో

వత్సవాయి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : యువకుడు నమ్మించి మోసం చేసిన నేపథ్యంలో యువతికి న్యాయం చేయాలంటూ మక్కపేటకు చెందిన ఆమె బంధువులు వత్సవాయి బస్టాండ్ చౌరాస్తాలో శుక్రవారం రాస్తారో చేపట్టారు. బాధితురాలు యండ్రాతి అరుణ మాట్లాడుతూ సందీప్ తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా లోబర్చుకున్నాడని, పెళ్లి విషయం ఎత్తగానే తప్పించుకొని తిరుగుతున్నాడని వాపోయింది. పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టగా ఏడాదిన్నర తర్వాత పెళ్లి చేసుకుంటానని హామి పత్రం రాసి ఇచ్చి, ఏడాదిన్నర గడిచినా పెళ్లికి అంగీకరించడం లేదని, పెద్దలు సైతం తనకు న్యాయం చేయడం లేదని ఆమె రోదిస్తూ చెప్పింది. ప్రేమించిన వ్యక్తి పెళ్లి చేసుకోనందునే రోడ్డెక్కాల్సి వచ్చిందని ఆమె తెలిపింది. సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు రాస్తారోకో చేయడంతో నాలుగు వైపులా వందల సంఖ్యలో వాహనాలు నిలిచి ట్రాఫిక్ స్తంభించింది. ప్రయాణికులు నానా పాట్లు పడ్డారు. పోలీసులు వచ్చి తగు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు.



అమరావతిలోని సీఆర్‌డీఏ ప్రాజెక్టు కార్యాలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ భార్గవ్‌తేజ్

సీఆర్‌డీఏ ప్రాజెక్టు కార్యాలయం ప్రారంభోత్సవం 13న

కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజా రాజధాని అమరావతిలో ఏపీ సీఆర్‌డీఏ ప్రాజెక్టు కార్యాలయం ఈనెల 13న ప్రారంభం కానున్నది. కార్యాలయాన్ని అదనపు కమిషనర్ భార్గవ్‌తేజ్ శుక్రవారం పరిశీలించారు. నిర్మాణం పూర్తి చేసుకొన్న ప్రాజెక్టు కార్యాలయంలోని పలు ఫ్లోర్లు, వివిధ చాంబర్‌లను ఆయన సందర్శించారు. అదనపు కమిషనర్‌కు సీఆర్‌డీఏ హౌసింగ్, బిల్డింగ్స్ విభాగ చీఫ్ ఇంజినీర్ పి.వి.భాస్కర్, డెవలప్‌మెంట్ ప్రమోషన్ జోనల్ జాయింట్ డైరక్టర్ కె.దివ్యలత, కమ్యూనికేషన్స్ విభాగ డిప్యూటీ డైరక్టర్ ఎం.సిద్ధార్థ వర్మ తదితరులు ప్రాజెక్టు కార్యాలయంలో పూర్తికానున్న పనులను వివరించారు. ప్రాజెక్టు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి అదనపు కమిషనర్ పలు సూచనలు చేశారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

అమరావతిలో అత్యాధునిక సెంట్రల్ లైబ్రరీ

వన్‌టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో అత్యాధునిక వసతులతో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తెలిపారు. విజయవాడలో శుక్రవారం జరిగిన వర్క్‌షాప్‌లో అయన మాట్లాడారు. ప్రపంచ స్థాయి గుర్తింపు పొందేలా ఐదు ఎకరాల స్థలంలో లైబ్రరీ నిర్మాణం ఉంటుందన్నారు. ఈ లైబ్రరీ భవిష్యత్ తరాలకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించేలా ఉంటుందన్నారు. ఇతర దేశాల్లో కూడా పలు లైబ్రరీలను సందర్శించి వచ్చానన్నారు. నిపుణుల అభిప్రాయాలను తీసుకుని అందరికీ నచ్చేలా, మెచ్చేలా గ్రంథాలయం నిర్మిస్తామన్నారు. ఏ విధంగా రూపకల్పన చేయాలనే అంశాలపై వర్క్ షాపు నిర్వహించామన్నారు. డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు, సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన అంశాలను నిపుణులు వివరించారన్నారు. ఈ గ్రంథాలయం నిర్మాణం కోసం త్వరలోనే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో డిజైన్ కాంపిటేషన్స్ నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర మౌలిక వసతులు కల్పన బోర్డు చైర్మన్ రాజశేఖర్, గ్రంథాలయ సంస్థ బోర్డు డైరెక్టర్ డైరెక్టర్ రాసాని పద్మజ, రామ్మూర్తి, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ కృష్ణ మోహన్, తదితరులు పాల్గొన్నారు.



ఐడీసీ చైర్మన్ లీలా కృష్ణతో మాట్లాడుతున్న రాటకొండ చంద్రశేఖర్

వేదాద్రి పైప్‌లైన్ పనులకు నిధులివ్వాలి

నందిగామ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : వేదాద్రి ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ మరమ్మతులకు నిధులు అందించాలని నందిగామ ఎన్ఎస్‌పీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రాటకొండ చంద్రశేఖర్ కోరారు. ఐడీసీ చైర్మన్ వేగుల్ల లీలా కృష్ణ, ఐడీసీ ఎండీ తిరుమలరావును వారి కార్యాలయంలో శుక్రవారం ఆయన కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఎంపీ కేశినేని శివనాథ్ నిధుల నుంచి మంజూరైన రూ.33 లక్షలతో మోటారు మరమ్మతులు పూర్తి చేశామన్నారు. ట్రైల్ రన్ నిర్వహిస్తుండగా పైప్‌లైన్లు పగిలిపోతున్నాయని తెలిపారు. వాటి ఫొటోలను వారికి చూపించారు పైప్‌లైన్ మరమ్మతులకు నిధులను మంజూరు చేయాలని కోరారు. ఐడీసీ చైర్మన్‌లీలా కృష్ణ మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరలో అవకాశం మేరకు నిధులు అందిస్తామని, పను లు కొనసాగించాలని సూచించారు. ఎట్టి పరిస్థితులలో వారం రోజుల్లో మరమ్మతులు పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించాలని ఆయన కోరారు. ఈ లింగాలపాడు టీడీపీ నేత ఉమ్మినేని విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితకు వినతిపత్రం అందజేస్తున్న నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, సభ్యులు

ధన్వంతరి జయంతి వేడుకలకు ఉత్తర్వులివ్వండి

పాయకాపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆయుర్వేద వైద్యానికి మూలపురుషుడైన ధన్వంతరి జయంతి వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా త్వరితగతిన ఉత్తర్వులు జారీ చేయాలని నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం శుక్రవారం బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్. సవితను కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రి సవితను మర్యాదపూర్వకంగా కలిసిన నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, డైరక్టర్లు వినతిపత్రాన్ని అందజేశారు. ఈనెల 18వ తేదీన విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ధన్వంతరి జయంతి వేడుకలు నిర్వహించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరక్టర్లు సూరవరపు నాగరాజు, లంకా రత్నారావు, నిడమానూరు రమేష్, మద్దిరాల గంగాధర్, పల్లేటికుర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజధాని రైతుల వార్షిక కౌలు రూ.6.64 కోట్లు విడుదల

విజయవాడ కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం నుంచి చెల్లించవలసిన వార్షిక కౌలు జమ చేశారు. రైతుల బ్యాంకు ఖాతాల లింకేజీ ప్రక్రియలో తలెత్తిన సాంకేతిక కారణాలు, కొంతమంది రైతులు తమ ప్లాట్లను విక్రయించినందున, మరణించిన రైతుల వారసుల ఖాతాలలో కౌలు లబ్ధి జమ చేయడానికి నిర్ణీత ధ్రువపత్రాలు అధికారులకు అందచేయనందున పలువురు రైతుల ఖాతాల్లో 9వ, 10వ, 11వ ఏడాదికి సంబంధించి వార్షిక కౌలు జమ కాలేదు. ఈ తరహా సమస్యలను పరిష్కరించిన సీఆర్‌డీఏ 495 మందికి అందాల్సిన పెండింగ్ వార్షిక కౌలు నిధులు రూ.66,480,402 సంబంధిత రైతుల ఖాతాలలో జమ చేసింది. ఈ మొత్తం నగదులో 9వ, 10వ ఏడాది వార్షిక కౌలు 232 మందికి రూ.4,08,41,632, అలాగే 11వ ఏడాది వార్షిక కౌలు 263 మందికి రూ.2,56,38,770 రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు కమిషనర్ కార్యాలయం తెలిపింది.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతి


తిరువూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పీటీ కొత్తూరు వద్ద ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందారు. చిట్యాల గ్రామానికి చెందిన తేలె వెంకటేశ్వరరావు (60) ద్విచక్రవాహనంపై తిరువూరు వస్తుండగా, తిరువూరు నుంచి ద్విచక్రవాహనంపై పీటీ కొత్తూరు వెళుతున్న నాగేశ్వరరావు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి, ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వెంకటేశ్వరరావు చికిత్స నిమిత్తం తిరువూరు తరలిస్తుండగా మృతి చెందాడు, ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

ప్రధాన స్కిల్ హబ్ కేంద్రాల్లో ఉచిత నైపుణ్య శిక్షణ

గుడివాడ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు మూడు ప్రధాన స్కిల్ హబ్ కేంద్రాల్లో ఉచిత నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాబివృద్ధి అధికారి డాక్టర్ నరేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గన్నవరంలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్‌లో మూడు నెలలపాటు ఆఫీస్ అసిస్టెంట్ (ఎంఎస్ ఆఫీస్, టైపింగ్) కోర్సు శిక్షణ ప్రారంభిస్తున్నామన్నారు. 10వ తరగతి లేదా అంతకంటే పైస్థాయి విద్యార్హత కలిగిన 35 సంవత్సరాల వయస్సులోపు వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ నెం.9494005725ను సంప్రదించాలన్నారు. గుడివాడలోని కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐలో రెండు నెలలపాటు ఫ్రంట్ ఆఫీస్ అసిస్టెంట్ కోర్సుకు శిక్షణ ఇస్తామన్నారు 10వ తరగతి, పైస్థాయి విద్యార్హత కలిగి 16 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన అభ్యర్థులు ధరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 98488 19682, 96666 54641కు సంప్రదించాలని కోరారు. మచిలీపట్నంలోని ప్రభుత్వ ఐటీఐలో మూడు నెలలపాటు జూనియర్ డిజైనర్-సీఏడీ కోర్సును ప్రారంభిస్తున్నామని, ఇంటర్ పైస్థాయి విద్యార్హత కలిగిన 16 నుంచి 45 సంవత్సరాల వయస్సు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 99664 89796ను సంప్రదించాలని సూచించారు.

మైనార్టీ యువతకు విదేశాల్లో ఉపాధి అవకాశాలు

- విజయవాడలో ఇంటర్వ్యూలు 13న
- మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ హసీంబేగ్



మచిలీపట్నం టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మైనార్టీ వర్గాల యువతకు విదేశాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని, మైనార్టీలు సద్వినియోగం చేసుకోవాలని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ హసీంబేగ్ తెలిపారు. జిల్లాలోని ముస్లిం, క్రైస్తవ, ఇతర మైనార్టీ వర్గాలకు చెందిన యువతకు విదేశాలలో నర్సింగ్, హెల్త్‌కేర్, టెక్నికల్ సర్వీసు రంగాలలో ఉద్యోగావకాశాలు కల్పిస్తోందన్నారు. ఖతార్‌లో ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. బీఎస్సీ చదివిన మైనార్టీ యువతీ యువకులకు ఈనెల 13న విజయవాడ ఎన్టీఆర్ సర్కిల్‌లోని మైనార్టీ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. 21 నుంచి 41 ఏళ్ల మధ్య ఉన్న మైనార్టీ నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ ఇచ్చి ఖతార్ పంపుతామన్నారు. ఎంపికైన వారికి నెలకు లక్షా 20 వేలు జీతం ఉంటుందన్నారు. వివరాలకు సెల్ నెం 9849901148కు లేదా 9985306408కు ఫోన్ చేయవచ్చన్నారు. మరిన్ని వివరాలకు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను సంప్రదించవచ్చన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	248
చికెన్ స్కిన్‌లెస్	258



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

బాలుర హాస్టల్లో తనిఖీలు

నందివాడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నందివాడ బీసీ సంక్షేమ శాఖ బాలుర హాస్టల్‌ను నందివాడ మండల పరిషత్ అధికారిణి మల్లేశ్వరి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ శుభ్రత, మంచినీటి పరిశుభ్రత హాస్టల్‌పై వాటర్ ట్యాంక్ నెలలో ఎన్ని సార్లు కడుతున్నది, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డాబాపై వాటర్ నిల్వతో పాకుడు పట్టి నడవటానికి వీలు లేని పరిస్థితి ఉండటంతో పంచాయతీ వర్కర్‌తో బ్లీచింగ్ చల్లించి క్లీన్ చేసే విధంగా చర్యలు చేపట్టారు. హాస్టల్ చుట్టూ ప్రక్కల శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని హాస్టల్ సిబ్బందికి తెలిపారు.



హాస్టల్‌పై భాగంలో బ్లీచింగ్ చల్లిస్తున్న ఎంపీడీవో మల్లేశ్వరి



వేమవరం- నాగవరం రహదారి

రహదారి మరమ్మతులకు నిధుల మంజూరు

గుడ్లవల్లేరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : నాగవరం గ్రామసమస్యలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికితీసుకెళ్లిన వెంటనే కలెక్టర్ డీకే బాలాజీ నాగవరం గ్రామానికి వెళ్లి సమస్యలు పరిశీలించారు. ఆయన గ్రామాన్ని పరిశీలించి గ్రామస్థులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన 24 గంటల్లోనే డిప్యూటీ సీఎం కార్యాలయం నుంచి గ్రామానికి దశాబ్దాలుగా నెరవేరని రహదారి నిర్మాణం చేయాలని ఆదేశాలు వెలువడ్డాయి. వెంటనే జిల్లా కలెక్టర్ బాలాజీ ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో వేమవరం నుంచి నాగవరం వరకూ బీటీ రహదారి నిర్మాణానికి మూడు బిట్లుగా మొత్తం రూ. 1.31కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న కలెక్టర్ బాలాజీకి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.



మందుగుండు సామాగ్రిని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

మందుగుండు సామగ్రి స్వాధీనం

కూచిపూడి: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన రూ.60 వేల విలువ గల మందుగుండు సామగ్రిని కూచిపూడి - పెదపూడి సెంటర్ లోని ఓ గోదాములో గురువారం రాత్రి స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తి కటకం పూర్ణ చంద్రరావుపై కేసు నమోదు చేసినట్లు కూచిపూడి ఎస్సై కె.ఎస్.విశ్వనాథ్ తెలిపారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాలతో కూచిపూడి ఎస్సై విశ్వనాథ్, మచిలీపట్నం స్పెషల్ పార్టీ ఎస్సై చందన్ కిరణ్ వారి బృందాలతో దాడులు నిర్వహించారు. మధ్యవర్తుల సమక్షంలో అక్రమంగా నిల్వ ఉంచిన మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకుని నిల్వ ఉంచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాఠశాలా.. పందుల దొడ్డా..!

- హైస్కూల్ గ్రౌండ్‌లోనే పందుల స్వైర విహారం
- రోగాల బారీన పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - తోట్లవల్లూరు) : తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్, ప్రక్కనే మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు పందులకు ఆవాసంగామారాయి. హైస్కూల్లోనే నివాసం ఏర్పాటు చేసుకుని పిల్లలను సైతం పెట్టటంతో పందుల సంఖ్యలో పెరిగిపోయాయి. హైస్కూల్ వంటశాల, తరగతి గదులు, మంచినీటి కుళాయిల వద్ద మురుగులో పందులు స్వేచ్ఛగా తిరుగుతున్నాయి. విద్యార్థులు భోజనం చేసే సమయంలో ఆహారం కోసం, వారు కడిగే ఎంగిలి నీరు కోసం ఎగబడుతుంటాయని విద్యార్థులు వాపోతున్నారు. ఆహారానికి కొదువ లేకపోవటంతో పందుల యజమాని వాటిని పాఠశాల గ్రౌండ్ లోనే ఉంచుతున్నాడు. తరగతులు జరుగుతున్నప్పుడు పక్కనే చెట్లనీడన దొర్లాడుతుండటంతో దుర్వాసన వస్తుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైస్కూల్ విద్యార్థులు వినియోగించే నీరంతా ప్లాస్టిక్ పైపు నుంచి ప్రాథమిక పాఠశాలలోని వంటషెడ్డు పక్కన నిర్మించిన సిమెంటు వరల్లోకి చేరుతుంది. అది నిండిపోయి బయటకు వచ్చి మురుగు గుంట ఏర్పడింది. ప్లాస్టిక్ పైపు పగిలి నీరు వరల్లోకి పూర్తిగా చేరకుండా బయటకు వస్తోంది. దీంతో ఈ మురుగు గుంటలో పందులు ఎక్కువగా పడుకుని రోత చేస్తున్నాయి. పక్కనే అడుగు దూరంలోనే వంటషెడ్డు, అక్కడే పందులు ఉండటం ఆందోళన కలిగించే అంశంగా మారింది. రెండు పాఠశాలల చుట్టూ విశాలమైన గ్రౌండ్ ఉండటంతో స్వేచ్ఛగా తిరుగుతున్నాయి. పిల్లలను పెట్టిన పంది విద్యార్థులపై దాడి చేసే ప్రమాదం ఉంది. దీంతో విద్యార్థులు గ్రౌండ్‌లో తిరగలేని పరిస్థితి ఏర్పడింది. వర్షాకాలం కావటంతో అనారోగ్యాలు ప్రబలే ప్రమాదం నులకొంది. విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

దాడి చేస్తాయేమోనని భయమేస్తుంది

పందుల ఫొటోలు, వీడియోలను గ్రామ పంచాయతీ, మండల, జిల్లా అధికారులకు పంపించాము. బయటకు తోలేందుకు ప్రయత్నించినా గ్రౌండ్ అంతా తిరుగుతూ దొరకడం లేదు. విద్యార్థులపైకి దాడి చేస్తాయన్న భయం కలుగుతోంది. హైస్కూల్లో మురుగు చేరకుండా చూస్తాం.

ఫణి రాజమోహన్ , ప్రధానోపాధ్యాయుడు



వంటషెడ్డు వద్ద మురుగులో పందులు



పాఠశాల ఆవరణలోకి వచ్చిన మురుగు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

గిట్టుబాటు ధరల కోసమే స్థిరీకరణ నిధి

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు,అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం మూడువేల కోట్లతో మార్కెట్ స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసినట్లు పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక మార్కెట్‌యార్డులో శుక్రవారం ఏఎంసీ చైర్మన్ జన్నుశోభన్‌బాబు ఆధ్యక్షతన నిర్వహించిన తొలి సర్వసభ్య సమావేశంలో గౌరవ అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. మార్కెట్ యార్డులోని శిథిలమైన గౌడౌన్లను పడగొట్టి నూతన వాటిని నిర్మించేందుకు, మార్కెట్ శాఖ నిధులతో రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు అవసరమైన డొంక రోడ్ల ఆధునీకరణకు అవసరమైన నిధుల కేటాయింపుకు సమావేశంలో తీర్మానించారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు స్వర్ణలతఎఎంసి కార్యదర్శి శివరామకృష్ణ, పిశిరిషా, ఏవో శివనాగరాణి, తహసిల్దార్ రవికాంత్, ఎఎంసి డైరక్టర్లు , రైస్ మిల్లుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

● తహసీల్దార్ ఎం కుసుమకుమారి

తోట్లవల్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, పాన్‌పరాగ్, గుట్కా, పొగాకు ఉత్పత్తులను వినియోగించవద్దని, వీటి వల్ల క్యాన్సర్, తదితర అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని తహసీల్దార్ ఎం కుసుమకుమారి కోరారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం టుబాకో ఫ్రీ క్యాంపెయిన్ నిర్వహించారు. ముందుగా తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి , గ్రామంలో ప్ల కార్డులతో ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ కె అనిల్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ డి రత్నం, ఎం దివ్యలత, సీహెచ్ కిరణ్ ఆశాల పాల్గొన్నారు.

పామర్రు : నూతనంగా కొలువుదిరుతున్న ఉపాధ్యాయులు విద్యార్థిదశ నుంచే చిన్నారులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలని పామర్రు సీఐ వి.సుభాకర్ అన్నారు. స్థానిక ప్రగతి డీఎస్సీ కోచింగ్ సెంటర్లో కొనసాగుతున్న నూతన ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల్లో సీఐ పాల్గొని డ్రగ్స్‌వల్ల సమాజంలో జరుగుతున్న అనర్థాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రగతి విద్యాసంస్థల అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తోట్లవల్లూరులో ప్ల కార్డులతో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ కలిగి ఉండాలి

గుడివాడ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు శారీరక ఆరోగ్యంపై దృష్టిపెట్టాలని శ్రీఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టూరి రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం స్థానిక గౌరీశంకరపురం లోని శ్రీఆదిత్య డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం "ఒత్తిడిని అధిగమించడానికి సరైన మార్గాలు" అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీలను నిర్వహించి, గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అలియా బేగం, సతీష్ చంద్ర, కో-ఆర్డినేటర్ జీవన్, శరత్‌కుమార్ పాల్గొన్నారు.

పమిడిముక్కల : ఐనపూరు, పమిడిముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం తమ్మన వేణుగోపాలరావు పాల్గొని బాలికల హక్కులపై అవగాన కల్పించారు. ఎస్ఎంసీ కమిటీ సభ్యురాలు ఎం. ఉమామహేశ్వరి, మహిళా సంరక్షణ కార్యదర్శి అఖిలవాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.ఉషా పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : పెనమకూరు జడ్పీ హైస్కూల్లో శుక్రవారం పోక్సో చట్టం, ఆడ పిల్లలపై వివక్ష, అసమానతలు తదితర అంశాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె నాగ మల్లేశ్వరి తెలిపారు.



విజేతకు బహుమతి అందజేస్తున్న కళాశాల సిబ్బంది



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం వేణుగోపాలరావు

వాటర్ ప్లాంట్స్‌లో శుభ్రతా ప్రమాణాలను పాటించాలి

● మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్

గుడివాడ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) : ప్రజారోగ్యం దృష్ట్యా వాటర్ ప్లాంట్ నిర్వాహకులు ఖచ్చితంగా శుభ్రత, నాణ్యతా ప్రమాణాలను పాటించాలని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో ప్రైవేట్ ఆర్వో వాటర్ ప్లాంట్ నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో డయేరియా కేసులు నమోదయ్యాయన్నారు. ఆర్వో వాటర్ ప్లాంట్స్‌లో వాటర్ కంటామినేషన్ జరిగిన ప్లాంట్‌లలో వాటర్ కొనుగోలు చేసిన ప్రజలు డయేరియా బారినపడ్డారన్నారు. పట్టణంలోని వాటర్ ప్లాంట్స్ నుంచి శాంపిల్స్‌ను తీసుకుని గుంటూరు ల్యాబ్‌కు పంపించామన్నారు. నివేదిక వచ్చిన అనంతరం లోపాలుంటే సంబంధిత ప్లాంట్‌లను మూసివేస్తామని కమిషనర్ హెచ్చరించారు. అనంతరం శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు, ఎమినిటీస్ కార్యదర్శులకు ఇంటింటి చెత్త సేకరణ, బ్లాక్డ్ కల్వర్టులు, కుళాయి కనెక్షన్ క్రమబద్ధీకరణ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, మున్సిపల్ ఇంజినీర్ ఎ.ఎస్.ఎన్ ప్రసాద్, డీఈలు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మనోహర్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

● సీఐ సోమేశ్వరరావు

గుడివాడ రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాలబాలికలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ సోమేశ్వరరావు అన్నారు. మోటూరు గురుకుల పాఠశాలలో గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ గురించి, ఫోన్ల వినియోగం, ఇంటర్ నెట్ వాడకంపై అవగాహన కల్పించారు. బాలికలు నూతన నెంబర్ల నుంచి వచ్చే కాల్ నెంబర్లు ఎత్తవద్దని తెలిపారు. ప్రతి ఇంటర్‌నెట్ వాడేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎస్సై చంటిబాబు మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రిన్సిపల్ విజయలక్ష్మి, ట్రైనీ ఎస్సై లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు. బొమ్ములూరులో టపాకాయలను తయారు చేసే గృహాలను పరిశీలించారు. అక్రమంగా టపాసులు తయారు చేసినట్లైతే చర్యలు తీసుకుంటామన్నారు.

నందివాడ: సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నందివాడ ఎస్సై శ్రీనివాసరావు రుద్రపాక జూనియర్ కళాశాల విద్యార్థులకు కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో సైబర్ నేరాలు ఎక్కువ అవుతున్న సందర్భంగా గ్రామాల్లో ఎవరైనా కొత్తవారు తిరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కాలేజీ ప్రిన్సిపల్ సాల్మాన్‌రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై చంటిబాబు

బిడ్డకు తల్లిపాలే అమృతం

పెదపారుపూడి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుటకు తల్లి ముర్రిపాలు ఎంతో ఉపయోగపడతాయని ఎంపీడీవో విమాదేవి అన్నారు. శుక్రవారం పెదపారుపూడి మండల పరిషత్ కార్యాలయంలో సూపర్‌వైజర్లు టి.అరుణకుమారి, ఎం.శివనాగరాణి ఆధ్వర్యంలో ఎంపీడీవో విమాదేవి అధ్యక్షతన పోషకాహార మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ సమీరా పాల్గొన్నారు.



ఎంఈవో వెంకటేశ్వరరావుకి వినతి పత్రం అందిస్తున్న నేతలు

బోధనేతర పనులను బహిష్కరిస్తాం

తోట్లవల్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో విద్యాబోధనలకు ఆటంకంగా మారిన బోధనేతర పనులను, విద్యాశక్తి కార్యక్రమాలను బహిష్కరిస్తున్నామని జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు పి ఇమ్మానుయేలు తెలిపారు. ప్యాప్టో పిలుపు మేరకు ఇక నుంచి విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయుల హాజరు పనులను మాత్రమే చేస్తామని ఎంఈవో జి వెంకటేశ్వరరావుకి మండలంలోని ఉపాధ్యాయ సంఘాల నేతలు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎం విజయశ్రీ, కార్యదర్శి ఎస్‌కె రియాజ్‌భాషా, ఏపీసీపీఎస్ ఈఏ కార్యదర్శి నాంచారయ్య, ఏపీటీఎఫ్ అధ్యక్షులు జెఝాన్సీరాణి, బిటిఏ జిల్లా కార్యదర్శి వి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలే లక్ష్యం

గుడివాడ : హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రజలకు మరింత చేరువ కావాలని, ఇప్పటికే బ్యాంకు లాకర్ల సౌకర్యం కల్పించి, ఖాతాదారులకు తక్కువ వడ్డీకి రుణాలను అందిస్తోందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుడివాడ శాఖ అధ్యక్షుడు డాక్టర్ మాగంటి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక సత్యనారాయణ పురంలోని కిన్నెర కాంప్లెక్స్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు 3వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ మాగంటి మాట్లాడుతూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎక్కువ మంది ఖాతాదారులకు తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేస్తోందన్నారు. బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ గుడ్లవల్లేటి మోహన్‌కుమార్, పాల్గొన్నారు.

విద్యార్థులకు సబ్బుల పంపిణీ

నందివాడ : స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా గుడివాడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నందివాడ మండలంలోని వెన్ననపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు నందివాడ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు శ్రీనివాసపురం ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు జనార్థనపురం విద్యార్థులకు సుమారు 700 మంది విద్యార్థినీ, విద్యార్థులకు రూ.40 వేల విలువ గల సబ్బులను డాక్టర్ నాగేంద్రనాథ్ తనయుడు చరణ్ సౌజన్యంతో రోటరీ క్లబ్ అధ్యక్షులు నాగేశ్వరరావు, సెక్రటరీ కిరణ్, ఎంఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంపిణీ చేసినట్లు వెన్నన్నపూడి ప్రధానోపాధ్యాయులు మాధవ కుమార్ తెలిపసారు. నందివాడ పాఠశాల హెచ్‌ఎం రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీచైతన్య కళాశాల ఫెస్ట్

గుడివాడ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) : విద్య విజ్ఞానం, వినోదం అందించడం శ్రీచైతన్య కళాశాల సొంతమని, మంచి విద్యా బోధనలు అందించడంతో పాటు ప్రతి ఒక్క విద్యార్థికీ ఉత్తమ స్కిల్స్‌నేర్పించడంలో శ్రీచైతన్య కళాశాల ఎల్లప్పుడూ ముందుంటుందని శ్రీచైతన్య కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ వేణుగోపాలరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఫంక్షన్ హాల్‌లో శ్రీచైతన్య కళాశాల ఫెస్ట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25 విద్యా సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, వీరితో పాటు పలు ప్రైవేట్ కంపెనీల్లో మంచి ప్యాకేజీలతో ఉద్యోగం సాధించిన పూర్వ విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాలరావు మాట్లాడుతూ గతంలో తమ కళాశాల విద్యార్థులు సాధించిన మంచి ఫలితాలే కళాశాల ఎదుగుదలకు తొలి మెట్టు అని అన్నారు. రాబోయే రోజుల్లోనూ ఇదే రీతిలో తమ కళాశాల నుంచి విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా తమ ఉపాధ్యాయులు ఉత్తమ బోధనలందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మెమోరాండం అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాలరావు

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ఉపశమనం

● ఎంపీడీవో విమాదేవి



పెదపారుపూడిలో..

పెదపారుపూడి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపు ద్వారా ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని ఎంపీడీవో విమాదేవి తెలిపారు. పెదపారుపూడిలోని చెరువు గట్టు వద్ద షాపుల యజమానులకు శుక్రవారం జీఎస్టీపై అవగాహన సదస్సును నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి ఈశ్వరి, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పులి ఇశ్రాయేలు, పీక అమోజ్, పులి అలెగ్జాండర్, గంప శ్రీను పాల్గొన్నారు.

పామర్రు: బాలికలు మనదేశాన్ని, సమాజాన్ని మెరుగుపరిచే మార్పును సృష్టించేవారని పామర్రు ఒకటి, రెండుగ్రామ సచివాలయాల జీఎస్టీ చాంపియన్లు పులిగడ్డరాజేశ్వరి, ఇందుపల్లి స్వాతిలు అన్నారు. అంగన్వాడీకేంద్రం సూపర్‌వైజరు సత్యశ్రీ పాల్గొన్నారు. కురుమద్దాలి సెక్టార్ పరిధిలో అడ్డాడ, పెదమద్దాలి, కురుమద్దాలి, నిమ్మకూరు, పసుమర్రు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ బాలికాదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సూపర్‌వైజరు విజయకుమారి, పద్మజ, ప్రేమ్‌కిరణ్, ఉమారాణి, అరుణ తదితరులుపాల్గొన్నారు.

కూచిపూడి: భారత ఆర్థిక వ్యవస్థపై జీఎస్టీ 2.0 ప్రభావం అంశానికి సంబంధించి మొవ్వ వీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు మొవ్వ ప్రధాన వీధుల్లో ర్యాలీని నిర్వహించారు. సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ ద్వారా ప్రజలకు అందుతున్న మేలును వివరించి ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాధవి, అధ్యాపకులు శివనాగేశ్వరరావు, కరుణశ్రీ, సురేష్ బాబు, కృష్ణారావు, రజనీకాంత్ పాల్గొన్నారు.



కూచిపూడిలో..

లక్ష్మీదేవిగా అష్టలక్ష్మీ అమ్మవారు

గుడివాడ రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : చిన్నఎరుకపాడులో వేంచేసి ఉన్న అష్టలక్ష్మీ అమ్మవారు శుక్రవారం లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ట్రస్టీ చైర్మన్ బొప్పూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు పూజలు నిర్వహించారు.

ఈ క్రాఫ్ నమోదు పూర్తి చేయాలి

గుడివాడ రూరల్ : ఈ-క్రాఫ్ త్వరగా పూర్తి చేయాలని ఏవో బోలెం అనంతలక్ష్మీ అన్నారు. శుక్రవారం కార్యాలయంలో వీఏఏలతో వివిధ అంశాలపై సమావేశం నిర్వహించారు. ప్రతి రైతూ ఈ-క్రాఫ్ నమోదు చేయించుకోవటానికి ముందుకు వచ్చేలా వీఏఏలు చూడాలని తెలిపారు.

ఫిల్టర్ బిడ్లు శుద్ధి

గుడ్లవల్లేరు : రక్షిత తాగునీటి పథకం ఫిల్టర్ బెడ్‌ల వద్ద పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం శుక్రవారం గుడ్లవల్లేరు గ్రామంలో నిర్వహించారు. స్థానిక వాటర్ ట్యాంక్ వద్ద ఫిల్టర్ బెడ్‌లను, వాటి పరిసరాలను శుభ్రపరిచారు. ఆ ప్రాంతమంతా జంగిల్ క్లియరెన్స్ నిర్వహించారు. పనులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్ పర్యవేక్షించారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

పామర్రు : సమాజంలో ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ పట్ల పూర్తి అవగాహనతో మెలగాలని పామర్రు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు టి.సుదేష్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ వద్ద మండలంలో ఎయిడ్స్‌పై అవగాహన నిమిత్తం ప్రచారం నిర్వహించే వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. వినయ్‌కుమారి, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

గుడివాడ : స్థానిక పాటిమీద వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రతీ శనివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం బేతవోలుకు చెందిన సానా సీతారామయ్య, గోవర్ధనమ్మ దంపతులు రూ.50,409లు విరాళంగా అందజేశారు.

మెడికల్ కాలేజీలపై జగన్ దుష్ప్రచారం

తోట్లవల్లూరు : మెడికల్ కాలేజీల నిర్మాణంపై మాజీ సీఎం జగన్ ఫేక్ రాజకీయాలు చేస్తున్నాడని, అభివృద్ధిని పక్కదారి పట్టించి దుష్ప్రచారం చేయటమే ఆయన లక్ష్యంగా ఉందని రాష్ట్ర గౌడ కార్పోరేషన్ చైర్మన్ వీరంకి వెంట గురుమూర్తి శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మచిలీపట్నం

• మచిలీపట్నం • పెడన • అవనిగడ్డ

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	248
చికెన్ స్కిన్‌లెస్	258

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

ముగిసిన పోస్టల్ వారోత్సవాలు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన తపాలా వారోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. పోస్టల్ శాఖ కార్యాలయంలో కస్టమర్స్ దినోత్సవం నిర్వహిచారు. పెంజెంద్ర గ్రామానికి చెందిన పెద్దిబోయిన శారద పాలసీ నిమిత్తం రూ. 3,12,521ను ఆమె భర్త పెద్దిబోయిన ఏడుకొండలుకు అందజేశారు.

హుండీల ఆదాయం రూ.1.47 లక్షలు

పెడన, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పైడమ్మ దేవస్థానంలోని హుండీలను శుక్రవారం లెక్కించారు. ఆరునెలల 22 రోజుల కాలానికి దేవస్థానానికి రూ.లక్షా 47 వేల 207 ఆదాయం సమకూరింది. దేవస్థానం ఈవో జి.వి.కృష్ణారావు, ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జి అరుణ, వంశపారంపర్య ధర్మకర్త దాసు వాయునందనరావు, ఆశాది దాసు శ్యామ్‌ల సమక్షంలో లెక్కింపు నిర్వహించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

జీఎస్టీ 2.0తో పేద, మధ్యతరగతి వర్గాలకు మేలు

పెడన, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే ప్రభుత్వం జీఎస్టీ 2.0 ద్వారా పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు సూపర్ గిఫ్ట్ ఇచ్చిందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా వాసవీ ప్రార్థనా మందిరంలో శుక్రవారం ఎలక్ట్రానిక్స్ ఉత్సవ్ నిర్వహించారు. ఉత్సవాన్ని కృష్ణప్రసాద్ ప్రారంభించారు. ఎలక్ట్రానిక్స్ వస్తువుల ప్రదర్శనలో ఉంచిన వివిధ రకాల ఎలక్ట్రానిక్ వస్తువులను కృష్ణప్రసాద్ పరిశీలించారు. మునిసిపల్ కమిషనర్ ఎల్. చంద్రశేఖరరెడ్డి, జీఎస్టీ అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్ రంగమణి, టీడీపీ నాయకులు యక్కల శ్యామలయ్య, అబ్దుల్ ఖయూం, శీరం ప్రసాద్, పరసా జితేంద్ర, ఎలిగట్ల ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. పట్టణంలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ఆయన గ్రీవెన్స్‌డే నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోకపోవడంతో తమ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రోడ్లు, డ్రెయిన్లు, వీధి లైట్లు, మంచినీరు సమస్యలపై ప్రజలు తమకు భారీగా అర్జీలు సమర్పిస్తున్నారన్నారు. అధికారుల సహకారంతో సాధ్యమైనంత త్వరగా అర్జీలను పరిష్కరిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, కలంకారీ క్లస్టర్ కమిటీ చైర్మన్ బళ్ల ప్రసాద్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, కమ్మగంటి బాబు, కొల్లూరి రాధాకృష్ణ, తమ్మా భీమయ్య పాల్గొన్నారు.



నాగుల చవితి ఏర్పాట్లపై వివిధ శాఖల ఉద్యోగుల సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు

నాగులచవితి వేడుకలు విజయవంతం చేద్దాం

మోపిదేవి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 25వ తేదీన నిర్వహించే నాగులచవితి వేడుకలను విజయవంతం చేసేందుకు ఆయా శాఖల ఉద్యోగులు సహకరించాలని ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు, తహసీల్దార్ ఎం.హరనాథ్ కోరారు. నాగుల చవితి వేడుకలపై శుక్రవారం సాయంత్రం దేవాలయ ప్రాంగణంలో వివిధ శాఖల ఉద్యోగులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో వారు మాట్లాడారు. 50 వేల మందికిపైగా భక్తులు నాగులచవితికి మోపిదేవి వస్తారని, తెల్లవారుజాము 2.30 గంటల నుంచే దర్శనం కల్పిస్తామని తెలిపారు. ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి మంచినీరు, మజ్జిగ, పాలు, ప్రసాదం ఉచితంగా అందిస్తామని తెలిపారు. వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ప్రదేశం ఏర్పాటు చేస్తామని చల్లపల్లి సీఐ ఈశ్వరరావు తెలిపారు. ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రాంతాల నుంచి మోపిదేవికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించేలా చూడాలని రవాణా శాఖ అధికారులను కోరారు. సర్పంచ్ నందిగం మేరీరాణి, ఎస్ఐ సత్యనారాయణ, ఆర్టీసీ డీఎం హనుమంతరావు, పంచాయతీ కార్యదర్శి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

డిసెంబరులో కృష్ణా తరంగాలు నిర్వహిస్తాం

● క్రీడోత్సవాల ముగింపు సభలో కేయూ వీసీ రాంజీ

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): డిసెంబరులో కృష్ణాతరంగాలు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి కూన రాంజీ తెలిపారు. కృష్ణా యూనివర్సిటీలో క్రీడోత్సవాల ముగింపు సభలో శుక్రవారం ఆయన మాట్లాడారు. రెండో రోజు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.విజయకుమారి సమన్వయకర్తగా వ్యవహరించారు. విశిష్ట అతిథిగా ఆంధ్ర యూనివర్సిటీ రెక్టార్ పులిపాటి కింగ్ పాల్గొన్నారు. మరో ప్రత్యేక అతిథిగా ఇండియన్ బిజినెస్ స్కూల్ నుంచి ఆచార్య పందిత్ పామూరు విచ్చేశారు. రెండు రోజులుగా జరిగిన క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. క్రీడలకు సమన్వయకర్తగా పీడీ డాక్టర్ పి.గోపి, సాంస్కృతిక కార్యక్రమాలకు సమన్వయకర్తగా సహాయ ఆచార్యులు ఆర్. దుర్గాప్రసాద్ వ్యవహరించారు. డీన్ ఆచార్య వైకె సుందరకృష్ణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాంబాబు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేయూ వీసీ కూన రాంజీ

టపాసుల విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

కోడూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో లైసెన్స్ లేకుండా టపాసులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై చాణక్య హెచ్చరించారు. శుక్రవారం కోడూరులోని పలు దుకాణాల్లో రెవెన్యూ అధికారులతో కలిసి ఆయన తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా టపాసులు నిల్వ ఉంచినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి, ఆర్ఐ సుభాషిణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా టపాసులు నిల్వ చేయొద్దు

మోపిదేవి: అనుమతులు లేకుండా టపాసులు, మందు గుండు సామగ్రి నిల్వ చేస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎం.హరనాథ్, చల్లపల్లి సీఐ ఈశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని టపాసుల విక్రయ దుకాణాలను వారు పరిశీలించారు. పెదప్రోలు, మోపిదేవిలలో ఉన్న గోడౌన్, దుకాణాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎస్ఐ సత్యనారాయణ, వీఆర్వోలు నాగమల్లేశ్వరరావు, బొడ్డు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టపాసులు సీజ్

కొక్కిలిగడ్డ గ్రామంలో కేసాని వెంకటేశ్వరరావు అనుమతులు లేకుండా తయారు చేస్తున్న పది వేల టపాకాయలు, 9 కేజీల ముడిసరుకును సీజ్ చేశామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చల్లపల్లిలో హోల్‌సేల్ దుకాణాల తనిఖీ

చల్లపల్లి: టపాసుల దుకాణాల నిర్వాహకులు పటిష్టమైన భద్రతాచర్యలు తీసుకోవాలని ఎస్ఐ పీఎస్వీ సుబ్రహ్మణ్యం సూచించారు. చల్లపల్లిలోని హోల్‌సేల్ టపాసుల విక్రయ కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. విక్రయ కేంద్రం ఆవరణలో ముందస్తు భద్రతా చర్యలు ఏమేరకు తీసుకున్నారో పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.



కోనేరుసెంటర్ నుంచి కోటవారితుళ్లసెంటర్‌కు వెళ్లేదారిలో పోర్టురోడ్డుపై నిలిచిన నీరు

అధ్వానంగా రోడ్డు

● అవస్థలు పడుతున్న ప్రజలు

(మచిలీపట్నం టౌన్-ఆంధ్రజ్యోతి): కోనేరుసెంటర్ నుంచి కోటవారి తుళ్ల సెంటర్‌కు వెళ్లే పోర్టు రోడ్డు అధ్వానంగా ఉంది. కొద్దిపాటి వర్షానికే ముంపునకు గురవుతోంది. లైబ్రరీ, యూనియన్ బ్యాంకు ఎదురుగా పోర్టు రోడ్డు పల్లంగా ఉండటంతో పాటు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో వర్షం వచ్చిన రోజున ఈ రోడ్డుపై వెళ్లడానికి వాహనదారులు చాలా ఇబ్బంది పడుతున్నారు. వాహనాలపై వెళుతున్నప్పుడు పక్కవారిపై వాహనాల కారణంగా మురుగునీరు చింది దుస్తులు పాడవుతున్నాయి. రోడ్డును మెరక చేయాలని, డ్రెయినేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు.

పాత ఎడ్లంకలో అధికారుల పర్యటన

అవనిగడ్డ రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ బాలాజీ ఆదేశాల మేరకు ఎడ్లంక గ్రామస్థులు పడుతున్న సమస్యలను పరిష్కరించేందుకు పలువురు అధికారులతో కలిసి గ్రామంలో శుక్రవారం హౌసింగ్ పీడీ పోతురాజు పర్యటించారు. వరద ప్రభావంతో పడిపోయిన నివాసాలు కోతకు గురవుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. శాశ్వత పునరావాసానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు. ఇప్పటి వరకు ఇల్లు కోల్పోయిన వారికి నది అంచున ఉన్న మరి కొంతమందికి సురక్షిత ప్రాంతంలో నివేశనాస్థలాలు మంజూరు చేసేందుకు తగిన ప్రతిపాదనలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈఈ బుజ్జిబాబు, ఏఈ కార్తికేయ, ఆర్ఐ బాలాజీ పాల్గొన్నారు.



పాత ఎడ్లంకలో నదీ కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పంట కాలువలో మృతదేహం

అవనిగడ్డ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ పంట కాలువలో శుక్రవారం గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్టు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. మృతుడికి సుమారు 50 ఏళ్ల వయస్సు ఉంటుందని, మృతదేహం పూర్తిగా గుర్తుపట్టలేని స్థితిలో లంకమ్మ మాన్యం సమీపంలో చిక్కుకుని ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ఏరియా ఆస్పత్రికి తరలించామని ఎస్సై తెలిపారు.

ఆటోడ్రైవర్‌పై పోక్సో కేసు

నాగాయలంక, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): చోడవరం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ నందిగామ వంశీపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. 'వంశీ కాలేజీకి వెళ్లేవారిని ఆటోలో తీసుకెళుతుంటాడు. ఈ క్రమంలో ఆ ఆటోలో వచ్చే సీనియర్ ఇంటర్ చదివే బాలిక(17)ను ట్రాప్ చేసి శారీరక సంబంధం పెట్టుకున్నాడు. ఈనెల 7వ తేదీన విజయవాడలోని లాడ్జికి బాలికను తీసుకెళ్లాడు. తల్లిదండ్రులు అదేరోజు రాత్రి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.' అని ఎస్సై తెలిపారు. 8వ తేదీన బాలిక లాడ్జిలో ఉన్నట్లు గుర్తించామని, తల్లిదండ్రులు, ఆ బాలిక ఇచ్చిన ఆధారాలతో నిందితుడిపై శుక్రవారం పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీ దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మండల సమావేశాలకు

పూర్తి సమాచారంతో రావాలి

● అధికారులకు ప్రత్యేకాధికారి సాయిబాబు ఆదేశం

నాగాయలంక, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలకోసారి జరిగే మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు ఆయా శాఖల అధికారులు పూర్తి సమాచారంతో రావాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.సాయిబాబు సూచించారు. రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఆయన పలు శాఖల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ అధికారి కె.వెంకటేశ్వరరావు స్త్రీ శక్తి పథకంపై ఇస్తున్న సమాచారంపై ఆయన సంతృప్తి చెందలేదు. అవనిగడ్డ డీఎం కె.హనుమంతరావుకు ఫోను చేసి వివరాలు తెలుసుకున్నారు. స్త్రీ శక్తి పథకం వచ్చాక డిపో బస్సుల్లో రోజుకు 26 వేల మంది మహిళలు ప్రయాణం చేస్తున్నారని, మీరేమో 6 నుంచి 7 వేల మంది అని చెప్పటం బాగోలేదని అన్నారు. పూర్తి సమాచారం ఇవ్వని నాగాయలంక వసతిగృహం వార్డెన్ వనజా కుమారి, కమ్మనమోలు కార్యదర్శి విజయ్‌కుమార్, సమావేశానికి రాని ఎఫ్‌డీవో సునీత, ఎక్సైజ్, హౌసింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభకు హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వెంగళరావును ఆయన ఆదేశించారు. ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనాలు ఇవ్వాలని లంకే శ్రీనివాస ప్రసాద్ సమావేశంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఎంపీపీ భోగాది రాఘవరాణి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వివిధ శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి సాయిబాబు

ఉద్యమ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

అవనిగడ్డ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ టి.ప్రదీప్‌కుమార్ సూచించారు. సూక్ష్మ, చిన్న పరిశ్రమల వృద్ధిలో భాగంగా శుక్రవారం అవనిగడ్డలో నిర్వహించిన ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు వివిధ రాయితీలను అందిస్తోందని, సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని ఆయన సూచించారు. చిన్న తరహా పరిశ్రమలపై ఆయన మహిళలకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. పరిశ్రమల ప్రోత్సాహక అధికారి వై.నాగేంద్రభూపాల్, డీఆర్డీఏ ఏపీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెన్షన్ సవరించాలి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల్లో పాత వారికి ఒక పెన్షన్, కొత్త వారికి మరొక పెన్షన్ అమలు చేయడం సరికాదని సవరించాలని బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆత్మూరి ఏడుకొండలు డిమాండ్ చేశారు. శుక్రవారం బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాకు ఆయన నాయకత్వం వహించారు. పార్లమెంటులో ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన ద్రవ్య బిల్లులో పాత పెన్షనర్లు, కొత్త పెన్షనర్లను విడదీయడం సరికాదన్నారు. దీనివల్ల పాత పెన్షనర్లకు పీఆర్సీ వర్తించకుండా పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. దీనిని రద్దు చేయాలని, ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్ దేశవ్యాప్తంగా ఉద్యమం నిర్వహిస్తుందన్నారు. సంఘ కార్యదర్శి ఎండీ యూనస్, ఉపాధ్యక్షుడు ఎం.రామ్మోహనరావు, అసిస్టెంట్ సెక్రటరీ ఎ.బెనర్జీ, కోశాధికారి బి.శ్రీమన్నారాయణ, కో ఆర్డినేటర్ ఎస్.రంగనాథరావు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న బీఎస్ఎన్ఎల్ పెన్షనర్లు

తేనెటీగల పెంపకంతో ఉపాధి

మోపిదేవి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తేనెటీగల పెంపకం ద్వారా గ్రామీణ ప్రజలు ఉపాధి పొందొచ్చని, ఆర్థికంగా బలపడొచ్చని ఖాదీ గ్రామీణ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్ఎల్.ఎన్. మూర్తి తెలిపారు. ఖాదీ గ్రామీణ పరిశ్రమల సంస్థ ఆధ్వర్యంలో బొబ్బర్లంక గ్రామంలో పది రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. గ్రామంలో 20 మంది తేనెటీగల పెంపకానికి ముందుకు వచ్చారని తెలిపారు. గ్రామీణ మహిళలు ఇంటి వద్దే తేనెటీగలు పెంచుకోవడంపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉపసర్పంచ్ లింగం బసవ శంకరరావు, పంచాయతీ కార్యదర్శి లీలా వసుంధర, ట్రైనర్లు టీవీ రావు, రమేష్ కుమార్ పాల్గొన్నారు.



తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇస్తున్న అధికారులు

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అత్యవసర వైద్య చికిత్సలు అవసరమైన వారిని ముఖ్యమంత్రి సహాయనిధి ఆదుకుంటోందని, వేల మంది ప్రాణాలు కాపాడిందని తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ తెలిపారు. కానూరు గ్రామంలో బొడ్డు వాకలయ్యకు మంజూరయిన రూ.23,600 సీఎంఆర్ఎఫ్ చెక్కును శుక్రవారం ఆయన అందజేశారు. శ్రీహరి, పీతరాము, బొమ్మిడి ఏడుకొండలు, గోపు వెంకటరమణ, బోలిశెట్టి నాని, మోపిదేవి కృష్ణ, కొక్కిలిగడ్డ ప్రభుదాస్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ

రూ.80 లక్షల జడ్పీ నిధులతో అభివృద్ధి పనులు

చల్లపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్ నిధులు రూ.80 లక్షలతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు జడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి తెలిపారు. గ్రామాల్లో డ్రెయినేజీల నిర్మాణానికి రూ.40 లక్షలు, సీసీ, జీఎస్‌బీ రహదారుల నిర్మాణానికి రూ.40 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. చల్లపల్లి, వక్కలగడ్డ, పాగోలు, మేకావారిపాలెం, మాజేరు, లక్ష్మీపురం, యార్లగడ్డ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలు గ్రామాల్లో రహదారుల నిర్మాణం జరిగిందని, డ్రైనేజీలకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించామని, కొన్ని గ్రామాల్లో పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. యార్లగడ్డలో పుట్టతీర్థం రహదారి నిర్మాణం ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దాం

ఘంటసాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దామని సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థులు పిలుపునిచ్చారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా మూడవ రోజు ఘంటసాలలోని మహాత్మాగాంధీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్లాస్టిక్ వ్యతిరేక కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాసరచన, పోస్టర్ మేకింగ్ పోటీలను నిర్వహించారు. 20 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. గెలిచిన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జ్ డాక్టర్ వై.బ్రింద్యా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

26న సత్యసాయి స్వరాష్టకం పోటీలు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయిబాబా శతవర్ష జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా సత్యసేవా సమితి ఈనెల 26న విద్యార్థులకు స్వరాష్టకం పోటీలు నిర్వహిస్తున్నట్లు సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్ తెలిపారు. శుక్రవారం సత్యసాయి సేవా సమితి కార్యాలయంలో కరపత్రాలను ఆయన విడుదల చేశారు. నర్సరీ నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు సత్యసాయి స్వరాష్టకం పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్, పి.వరప్రసాద్, వెంకటచిన్నయ్య గుప్తా, లక్ష్మీబాయి, లక్ష్మివిశాలి, తుర్లపాటి సాయికృష్ణ, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కలంకారీ డిజైన్లపై అవగాహన

గూడూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కప్పలదొడ్డి గ్రామంలో శుక్రవారం పుణ్యవతి కలంకారీ యూనిట్ వద్ద వాసవ్య మహిళా మండలి, హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్త రకాల డిజైన్లపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హ్యాండ్లూమ్ శాఖ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.రామయ్య, నేషనల్ అవార్డు గ్రహీత బ్లాక్ మేకర్ నరసయ్య విచ్చేశారు. కొత్త వారికి హ్యాండ్ బ్లాక్ ప్రింటింగ్‌పై, కలంకారీ కళాకారులకు కొత్త రకాల డిజైన్లపై అవగాహన కల్పించారు. ట్రైనర్ యక్కల పీతాంబరధరరావు, వాసవ్య మహిళా మండలి ప్రోగ్రాం మేనేజర్ రామాంజనేయులు, కలంకారీ ప్రొడ్యూసర్స్, కలంకారీ కళాకారులు పాల్గొన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన

చల్లపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బేటీ బచావో-బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చల్లపల్లి రాజా హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థినులకు అవగాహనా సమావేశం నిర్వహించారు. విద్యార్థినిలకు గుడ్, బ్యాడ్ టచ్‌పై సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి వివరించారు. కార్యదర్శి పి.వి.మాధవేంద్రరావు, అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సీహెచ్‌సీ సాధించినందుకు అభినందన

చల్లపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సీహెచ్‌సీగా స్వచ్ఛాంధ్ర జిల్లా స్థాయి అవార్డును స్వీకరించిన సందర్భంగా చల్లపల్లి ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.ఎస్.ఆర్.శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సన్మానించి అభినందనలు తెలిపారు. శుక్రవారం ఏఎంసీ చైర్‌పర్సన్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు తోట కనకదుర్గ, వరదా హరిగోపాల్, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్, శానిటేషన్ సూపర్‌వైజర్ రమేష్‌లు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో మూడు ఆస్పత్రులను అవార్డులకు ఎంపికచేయగా, వాటిలో చల్లపల్లి ఒకటి కావడంపై ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. తొలుత చల్లపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బందిని అభివృద్ధి కమిటీ డైరెక్టర్ హరిగోపాల్ ఆధ్వర్యంలో సన్మానించారు. సొసైటీ చైర్మన్ బొందలపాటి వీరబాబు, డాక్టర్ జగదీష్, జనసేన నేత అడపా రవి పాల్గొన్నారు.



చల్లపల్లి ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.ఎస్.ఆర్.శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

ప్రత్యేక అవసరాలున్న చిన్నారులను ప్రోత్సహిద్దాం

అవనిగడ్డ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలున్న చిన్నారులకు తగిన ప్రోత్సాహాన్ని అందిద్దామని ప్రజలకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ న్యాయాధికారి కె.వి.రామకృష్ణ పిలుపునిచ్చారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవనిగడ్డ ఏబీడీ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడిచే ప్రత్యేక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు వారి న్యాయపరమైన హక్కులు, ప్రత్యేక అవసరాలున్న చిన్నారుల కోసం రూపొందించిన చట్టాలను వివరించారు. విద్యార్థులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేసి ప్రోత్సాహకాలను అందించారు. ప్రధానోపాధ్యాయురాలు శారద, ఫిజియోథెరపిస్ట్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ న్యాయాధికారి కె.వి.రామకృష్ణ



మాట్లాడుతున్న ప్రజా రవాణా జిల్లా అధికారి కె. వెంకటేశ్వర్లు

హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బందరు ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో శుక్రవారం హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రజా రవాణా జిల్లా అధికారి కె.వెంకటేశ్వర్లు తరగతులను ప్రారంభించారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ టి.పెద్దిరాజు పాల్గొన్నారు.

